### మట్టి గణపతిని పూజించి పర్యావరణాన్ని రక్షించాలి : కలెక్టర్ మనుచౌదరి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**

మట్టి గణపతి ప్రతిమలను పూజించి పర్యావరణాన్ని రక్షించాలని జిల్లా కలెక్టర్ మను చౌదరి కోరారు. జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయం రామచంద్ర పురం ఆధ్వర్యంలో జిల్లాలో ఉచిత మట్టి వినాయక విగ్రహాల వితరణ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్‌కు మట్టి గణపతి ప్రతీమను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ వినాయక నవరాత్రోత్సవల సందర్భంగా మట్టితో చేసిన గణపతి ప్రతిమలను పూజించి పర్యావరణాన్ని రక్షించాలన్నారు. మట్టి గణపతులను ప్రతిష్టిస్తే చెరువులు, నీటి వనరులు కలుషిత కావాని పర్యావరణాన్ని కాపాడాలని పకృతి సిద్దమైన సహజ రంగులను మాత్రమే ఉపయోగించాలన్నారు. జిల్లాలో 2500 మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న కాలుష్య నియంత్రణ మండలి అధికారులను అయన అభినందించారు. పర్యావరణాన్ని కాపాడడడంతో అందరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్, జిల్లా అదనపు కలెక్టర్, కలెక్టరేట్ సిబ్బందికి మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

# వార్త

## ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు

### మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు

**సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త :**

జిల్లా ప్రజలకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు శుక్రవారం వినాయక చవితి పర్వదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి పర్వదినాన్ని ప్రజలంతా కుటుంబసమేతంగా భక్తి శ్రద్దలతో జరుపుకోవాలన్నారు. సకల కార్యాలకు ప్రథమ పూజ చేసేది..పూజించేది విగ్నేశ్వరున్నే అని తెలిపారు. విగ్నేశ్వరున అనుగ్రహంతో విఘ్నాలు తొలిగి అన్నింటా శుభం చేకూరాలని అకాంక్షించారు. విగ్నేశ్వరున దయతో నిర్విఘ్నంగా అన్ని కార్యాలు నెరవేరాలని ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని విగ్నేశ్వరుణ్ణి ప్రార్థించారు. ప్రతి ఒక్కరూ ఇంటిలో మట్టి గణపతి ప్రతిమను పూజించాలన్నారు. మట్టి గణపతిని పూజించడంతో ఎంతో శ్రేష్టమని మట్టి గణపతే మహా గణపతి అని తెలిపారు. పర్యావరణాన్ని పరిరక్షణతో దేవుణ్ణి పూజించాలన్నారు.



దుద్దెడలో వెంచర్‌ను పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ అగర్వాల్

### వెంచర్‌ను పరిశీలించిన అదనపు కలెక్టర్

**కొండపాక, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త :** వెంచర్‌లో గ్రామ పంచాయతీకి రావాల్సిన పది శాతం వాటా భూమిని పరిశీలించిన జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్. దుద్దెడ శివారులోని రాజీవ్ రహదారిపై గల సప్తగిరి లీగల్ వెంచర్‌ను అమె సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీకి రావాల్సిన పది శాతం భూమి గురించి అడిగి తెలుసుకున్నారు. వెంచర్‌లో ఎర్పాటు చేసిన వీది లైట్లు, మురికి కాలువలను పరిశీలించారు. అమె వెంట సిపిఒ వందనం, తహసీల్దార్ దిపిప్ నాయక్, ఎంపిడిఒ వెంకటేశ్వర్లు, పిఆర్ఎఈ తిరుపతిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

### వినాయక ఉత్సవాలు ప్రశాంతంగా ముగియాలి

**-జిల్లా పోలీసులకు ఎస్‌పి రూపేష్ చెన్నూరి సూచన**



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా ఎస్‌పి రూపేష్ చెన్నూరి

**సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 6, ప్రభాతవార్త:** వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంతంగా ముగిసేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్‌పి సిహెచ్ రూపేష్ చెన్నూరి జిల్లా పోలీసులకు సూచించారు. శుక్రవారం సంగారెడ్డిలోని జిల్లా పోలీసు కార్యాలయం నుంచి జిల్లాలోని పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్ నిర్వహించి పోలీసులకు పలు సూచనలు చేశారు. పోలీసు ఠాణా ఎస్‌హెచ్ఒలు ఠాణా పరిధిలోని ప్రతి వినాయక మండపాన్ని ప్రత్యక్షంగా సందర్శించాలన్నారు. మండపాల వద్ద భద్రతపరమైన చర్యలను పరిశీలించాలన్నారు. జనజీవనానికి ఇబ్బందులు కల్గకుండా మండపాలు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. డిజేలకు అనుమతించవద్దని హెచ్చరించారు. డీజేలు ఏర్పాటు చేస్తే మండపాల నిర్వాహకులపై, డిజె యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. మండపాల ఏర్పాటును ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ద్వార అనుమతి తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాత్రి 10 గంటల తర్వాత మైకులు, లౌడ్ స్పీకర్లు శబ్దాలు చేయకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అత్యవసర సమయాల్లో 100కు వచ్చిన కాల్‌కు స్పందించాలన్నారు. పాత నేరస్తులను ముందస్తుగా బండోవర్ చేయాలని ఆదేశించారు. సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను యువత నమ్మవద్దని సూచించారు. ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు ముగిసేలా చూడాలని, అందుకు ప్రజలు తమ వంతు సహకరించాలని ఎస్‌పి రూపేష్ చెన్నూరి సూచించారు.

### ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడం తగదు

**-కలెక్టరేట ముందు బికెఎంయు ధర్నా**

**సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 6, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రలను తిప్పి కొట్టాల్సిన అవసరం ఉందని భారతీయ కేర్ మజ్దూర్ యూనియర్ (బికెఎంయు) నాయకులు హెచ్చరించారు. శుక్రవారం సంగారెడ్డిలోని కలెక్టర్ కార్యాలయం మందు బికెఎంయు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి డిఆర్‌ఓకు మెమోరండంను అందచేశారు. ఈ సందర్భంగా బికేఎంయు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి వినోద, తాజుద్దీన్‌లు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం ఉపాధి హామిని నిర్వీర్యం చేసే కుట్రలు పన్నుతోందని, బడ్జెట్ కేటాయింపును తగ్గిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. పని దిశా దిశను పూర్తిగా మార్చేసిందని విచారం వ్యక్తం చేశారు. 50 సంవత్సరాల వయసు దాటిన కూలీలకు నెలకు 5వేల రూపాయల పెన్షన్‌ను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గృహలక్ష్మి పథకంలో అర్హులైన వ్యవసాయ కూలీలకు గృహాలు నిర్మించుకునేందుకు 6 లక్షల రూపాయలను మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో ముస్తఫా, పాండు, యాకూబ్ అలీ, చిరంజీవి, మహబూబ్ అలీ, పాషా, పూలమ్మ, శంకరమ్మ, లక్ష్మి, రాధా, వహీదా, జ్యోతి, దేవి బాయి, అనసూజ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహిస్తున్న బికెఎంయు బాధ్యులు

**అప్పు కోసం కుదువ పెట్టిన భూమి అమ్ముకొని వేధిస్తున్నాడని**

### దంపతులు పురుగుల మందు డబ్బాతో ఆందోళన

**సిద్దిపేట రూరల్, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త :**

అప్పు కోసం కుదువ పెట్టిన భూమిని అమ్ముకుని మిగిలిన డబ్బులను ఇవ్వడం లేదని దంపతులు సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఓ మెడికల్ షాప్ ఎదుట శుక్రవారం పురుగుల మందు డబ్బాతో ఆందోళనకు దిగారు. భూమి అమ్మగా వచ్చిన డబ్బుతో అప్పు డబ్బులు పోగా మిగిలిన డబ్బులు ఇవ్వాలని బాధితులు డిమాండ్ చేశారు. నారాయణరావుపేట మండల పరిధిలోని జక్కాపూర్ గ్రామానికి చెందిన కవితశ్రీనివాస్‌రెడ్డి బాధిత దంపతులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట పట్టణంలోని ఓ మెడికల్ షాప్ యజమానికి తమ ఎకర భూమి కుదువ పెట్టుకొని రూ. 6 లక్షల అప్పు ఇచ్చాడని తెలిపారు. దీనికి రూ.2 లక్షల వడ్డీ చెల్లించామని ఆర్థిక ఇబ్బందులతో మిగతా డబ్బులు చెల్లించడంలో అలస్యమైందన్నారు. దీంతో తమకు తెలియకుండా కుదువపెట్టిన భూమి అమ్ముకున్నారని వారు ఆరోపించారు. అప్పుడ డబ్బులు పోగా మిగితా డబ్బులు ఇవ్వడం లేదని తమ ఆర్థిక పరిస్థితి బాగులేదని డబ్బులు ఇవ్వకుంటే తాము బకలేమన్నారు. తమ డబ్బులు తమకు వచ్చేలా చూడాలని కోరుతున్నారు.

**దేశంలో నెంబర్ వన్‌గా**

## మెదక్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని తయారుచేయాలి

- రెండు పడక గదుల ఇళ్లు అర్హులకు అందేలా చూడాలి
- ప్రభుత్వ వైద్య కళాశాల కోసం కృషి చేస్తా
- మెదక్ ఎంపి రఘునందన్‌రావు



మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు, చిత్రంలో కలెక్టర్ రాహుల్ రాజ్, హాజరైన వివిధ శాఖల అధికారులు

**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:**

దేశంలో నెంబర్ వన్‌గా మెదక్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని తయారు చేయాలని మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్‌రావు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా అభివృద్ధిపై కోఆర్డినేషన్, మానిటరింగ్(దిశ) సమావేశానికి ఎంపీ రఘునందన్‌రావు అధ్యక్షత వహించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, డీఆర్‌డీవో శ్రీనివాసరావు, విద్య, వైద్యం, వ్యవసాయం, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్, సివిల్ సప్లై, హౌసింగ్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంబంధిత శాఖల సమగ్ర సమాచారాన్ని ఆయా శాఖల అధికారుల ద్వారా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రణాళిక ప్రకారం ప్రజా ప్రయోజనార్థం అమలు చేసే ప్రతి పథకం గురించి ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, అవి అర్హులైన లబ్ధిదారులకు అందేలా అధికారులు చూడాలని అన్నారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా జిల్లాలో గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలు చేయాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు కేటాయించిన రెండు పడక గదులు అర్హులకు అందాయా సమీక్షించి అర్హులకు పట్టాలను అందించే పనులు చేపట్టాలన్నారు. నిర్మాణాలు పూర్తయి పంపిణీకి సిద్ధంగా ఉన్న వాటిని అసలైన లబ్ధిదారులకు అందించాలని సూచించారు. రాజీవ్ ఆరోగ్య శ్రీవైద్య సేవలు రోగులకు అందించడంలో ప్రైవేటే ఆసుపత్రులు ఇబ్బందులకు గురిచేయకుండా చూడాలని, టీ డయాగ్నోస్టిక్ కేంద్రాన్ని, ఆసుపత్రుల్లో అధికారులు తనిఖీలు చేపట్టాలన్నారు. జిల్లాలో రెండ్యూ, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని, అన్ని ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. సదరం క్యాంపు నిర్వహించాలని, సమాచారం పక్కాగా ప్రజలకు అందించాలన్నారు. మెదక్ మెడికల్ కాలేజీ ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ ద్వారా రాష్ట్ర ప్రభుతానికి నివేదిక అందించి కేంద్ర హెల్త్ సెక్రటరీని సంప్రదించి శక్తి వంచన మేరకు కృషి చేస్తానని ఎంపీ రఘునందన్‌రావు తెలిపారు.మెదక్ జిల్లా ఏర్పాటైన తరువాత మెదటి దిశ మీటింగ్ అని, 2013లో రామాలయం పక్కన ఉన్న స్కూల్ బిల్డింగన 10 గదులు కూలగొట్టాలని తీర్మానం చేసిన వాటిని వెంటనే చర్యలు తీసుకోవాలని, మెదక్ మున్సిపాలిటీలో శానిటేషన్ పకడ్బందీగా చర్యలు చేపట్టాలన్నారు. సెయిల్ హెల్త్ కార్డు కోసం నార్సింగి మండలాన్ని పైలస్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశామన్నారు. రైతుల సమస్యలు, ధరణి సమస్యలు క్షేత్రస్థాయిలో పరిష్కరించాలని సూచించారు. జాతీయ రహదారుల విషయంలో టెంపుల్ దగ్గర పది పీట్ల రోడ్డు ఉన్నప్పుడు టెంపుల్ విషయంలో సానుకూలంగా వ్యవహరించాలన్నారు. మన ఊరు మన బండి కింద పూర్తియిన మనోహరాబాద్, యావాపూర్ పాఠశాలలో క్షేత్రస్థాయిలో సందర్శిస్తానని చెప్పారు. మెదక్ మెడికల్ కాలేజీ విషయంలో నివేదిక జిల్లా కలెక్టర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి వెళ్లిందని, రాష్ట్ర ప్రభుత్వం నుండి నివేదిక తీసుకొని త్వరలోనే కేంద్ర హెల్త్ సెక్రటరీని కలిసి వచ్చేలా చూస్తానని తెలిపారు. దివ్యాంగులకు సదరన్ క్యాంపులు ఏర్పాటు చేసి సర్టిఫికెట్టు మంజూరు చేసి పరికరాలు మంజూరు చేయాలని చెప్పారు. జిల్లాలో 118 సబ్ సెంటర్లు ఉన్నాయని, పని ప్రారంభం కానివి 39 ఉన్నాయని, మిగితావి ప్రాసెస్‌లో ఉన్నాయని, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్ వివరించగా పూర్తి నివేదిక జిల్లా కలెక్టర్ తుది రిపోర్ట్ ఇస్తే మంత్రి దృష్టికి తీసుకెళ్లి నిధులు తీసుకువస్తామన్నారు. రెండు నేషనల్ హైవేలు కలిసే బోధన్ చౌరస్తా వద్ద 150 ఫీట్ల చౌరస్తాను 100 పీట్లకు ఎందుకు తగ్గిస్తున్నారు.. ఈ విషయంలో క్లారిటీ ఇవ్వాలని నేషనల్ హైవే అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ కూలీలు సరైన వేతనం రావడ లేదని ఫిర్యాదులు వస్తున్నాయని, ఈ విషయంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి చర్యలు తీసుకోవాలని అన్నారు. నర్సాపూర్‌లో 500 డబుల్ బెడ్‌రూం ఇండ్లను డ్రా తీసి లబ్ధిదారులకు కేటాయించాలని పేర్కొన్నారు. 2014 నుంచి 2024 వరకు 20 లక్షల మొక్కలు నాటారని, మొక్కలు నాటడంతోపాటు పరిరక్షణకు చర్యలు చేపట్టాలన్నారు.

మెదక్ స్టేడియంలో సింథటిక్ ట్రాక్ ఉందని, కోట్ల రూపాయలు ఖర్చు చేసి స్టేడియం కట్టారని, అథ్లెటిక్ అకాడమీ లేక ఇబ్బందులు పడుతున్నారని, ఫుట్‌బాల్ గ్రౌండన కృషి చేయాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ దిశా కమిటీలో పార్లమెంట్ సభ్యులు చర్చించిన అంశాలను సంబంధిత శాఖల ద్వారా సమావేశాలు నిర్వహించుకొని ఆదేశాలు జారీ చేస్తూ నిర్ధేశిత గడువు తేదీలోగా నివేదికలు తయారు చేసుకొని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజావాణి పెండింగ్ దరఖాస్తుల విషయంలో ప్రభుత్వ అర్హతలను మేరకు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. దరణి భూసమస్యలు అదనపుకలెక్టర్ రెవెన్యూ ద్వారా పరిష్కరిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ మామిండ్ల జ్యోతి కృష్ణ, నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో సమర్థవంతంగా 'ఫ్రైడే డ్రైడే' అమలు

**మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**



పైతర గ్రామంలో పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

**కొల్చారం, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:**

జిల్లాలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం సమర్థవంతంగా అమలు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. శుక్రవారం కొల్చారం మండలం పైతర గ్రామంలో సంబంధిత జిల్లా పంచాయతీ అధికారి యాదయ్యతో కలిసి గ్రామ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ ప్రజలు వ్యక్తిగత, శారీరక పరిశుభ్రతపై దృష్టి సారిస్తూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అదేవిధంగా గ్రామంలో దోమల నివారణకు చేపడుతున్న యాంటీ లార్వెల్ ఆపరేషన్లను పకడ్బంధీగా అమలు చేయాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మురుగు నీరు నిల్వఉన్న ప్రాంతాల్లో దోమల మందు పిచికారి చేయాలన్నారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలను రక్షించేందుకు వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా పంచాయతీ అధికారి సమన్వయంతో వ్యవహరించాలన్నారు. ప్రజలు కాచి చల్లార్చి వడబోసిన నీటినే తాగాలని, నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను సేవించకుండా తాజా వేడిగా ఉన్న పరిశుభ్రమైన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. తద్వారా వ్యాధులు దరిచేరవని చెప్పారు. వాతావరణంలో మార్పు వల్ల అంటువ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని, వాటిని అరికట్టడంలో వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తంగా ఉందని, ప్రజలు స్వచ్ఛందంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని దోమలు పుట్టకుండా, కుట్టకుండా జాగ్రత్తలు తీసుకొని వ్యాధులకు గురికావద్దని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ వవెంట పంచాయితీ అధికారి యాదయ్య, ఇన్‌ఛార్జి ఎంపీడీవో కృష్ణవేణి, మాజీ ఉప సర్పంచి భాను ప్రకాష్‌రెడ్డి, ఇతర గ్రామస్థులు తదితరులు ఉన్నారు.

## 9న ఖోఖో క్రీడాకారుల ఎంపిక

**పుల్కల్, సెప్టెంబరు 6, ప్రభాతవార్త:** ఉమ్మడి మెదక్ జిల్లాలోని క్రీడాకారులను ఈ నెల 9న 13వ తారీఖు నుంచి 15వ తేదీ వరకు ఖమ్మం జిల్లా కొల్లూరు మిని స్టేడియంలో నిర్వహించే 34వ సబ్ జూనియర్ రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనేందుకు క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు జిల్లా హడ్‌హాక్ కమిటి కన్వీనర్ వై మహేందర్‌రావు, పోచప్ప, నాగరాజులు సంయుక్త ప్రకటనలో తెలిపారు. 9న తూప్రాన్‌లోని సెయింట్ అర్నాల్డ్స్ హై స్కూల్‌లో క్రీడా కారులను ఎంపిక చేస్తామన్నారు. క్రీడాకారులు 14 సంవత్సరాల లోపు వారు అయి ఉండాలని వారు సూచించారు. పూర్తి వివరాలకు 9866546563/8985655935/944069925లను సంప్రదించాలని జిల్లా హడ్‌హాక్ కమిటి బాధ్యులు సూచించారు.

### మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన రామకృష్ణారావు

**నర్సాపూర్, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త:** నర్సాపూర్ మున్సిపల్ కమీషనర్‌గా డాక్టర్ రామకృష్ణారావు పదవీ బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతల స్వీకరణకు ముందు మున్సిపల్ చైర్మన్ దుర్గప్పగారి అశోక్‌గౌడ్ ఇంటికి వెళ్ళి మర్యాదపూర్వకంగా కళిశారు. ఈ సందర్భంగా అభినందనలు తెలియజేశారు. కాగా ఇప్పటివరకు కమీషనర్‌గా విధులు నిర్వహించిన జైత్‌రామ్‌నాయక్ బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో రామకృష్ణారావు నర్సాపూర్ మున్సిఫల్ కమీషనర్‌గా బదిలీ రాగా డాక్టర్ రామకృష్ణారావు పదవీ బాధ్యతలను చేపట్టడ్డం జరిగింది. ఈ సమయంలో మున్సిపల్ మేనేజర్ మధుసూధన్,ఫైజాన్, సిపిఎం నాయకుల కదారి నాగరాజు తదితరులున్నారు.

**ఫార్మర్ ప్రొడ్యూసింగ్ ఆర్గనైజేషన్‌లు**

## వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ రంగంలోకి వెళ్లాలి

**సిద్దిపేట జిల్లా కలెక్టర్ మను చౌదరి**



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ మను చౌదరి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**

ఫార్మర్ ప్రొడ్యూసింగ్ ఆర్గనైజేషన్‌లు(ఎఫ్‌ఓఎస్) వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ రంగంలోకి వెళ్లాలని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి సూచించారు. శుక్రవారం జిల్లా క్యాంపు కార్యాలయంలో కృషి కల్ప ఫౌండేషన్ సీఈవో సీఎం పాటిల్‌తో కలిసి అక్కన్నపేట మండలంలోని మల్లంపల్లి గ్రామానికి చెందిన ప్రహర్ష, గండిపల్లి గ్రామానికి చెందిన ప్రసిద్ద ఫార్మర్ ప్రొడ్యూసింగ్ ఆర్గనైజేన్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కృషి కల్ప ఫౌండేషన్ సహకారంతో అక్కన్నపేట మండలంలోని మల్లంపల్లి గ్రామానికి చెందిన ప్రసిద్ద ఫార్మర్ ప్రొడ్యూసింగ్ ఆర్గనైజేషన్లను బలోపేత చేసేందుకు ప్రత్యేకంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎఫ్‌పిఓలను బలోపేతం చేసేందుకు ఆధునిక సాంకేతిక నైపుణ్యాన్ని అందించేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉందని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వరి,పత్తి పంటలతో పాటు ఇతర వాణిజ్య పంటలను అధునిక పద్దతిలో పండించి అధిక దిగుబడులను సాధించాలన్నారు. కృషి కల్ప ఫౌండేషన్ సీఈవో సీఎం పాటిల్ ఎఫ్‌పిఓలను వ్యవసాయ ఉత్పత్తులను సాధించేందుకు కృషి చేయడంతోపాటు ఎఫ్‌పిఓలే ప్రొడ్యూస్ చేసిన వ్యవసాయ ఉత్పత్తులను నేరుగా కొనుగోలుదారులకు అమ్మితే అధిక లాభాలను పొందచ్చుని ఆ దిశగా ఎఫ్‌పిఓలకు కావాలసిన వ్యాపార శిక్షణను అందించేందుకు సిద్దంగా ఉన్నామని తెలిపారు. ఉత్పత్తులు క్వాలిటీగా ఉంటే వినియోగాదారులను విశేషంగా అకర్షిస్తాయని అధిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నాణ్యమైన ఉత్పత్తులను సాధించాలన్నారు. సమావేశంలో ఉద్యానవన అధికారి సువర్ణ, డిఆర్‌డిఏ పిడి జయదేవ్ ఆర్య, నాబార్డు డిడిఎం నిఖిల్‌రెడ్డి, అక్కన్నపేట హార్టికల్చర్ అఫీసర్ కౌసల్య, ఏఈవోలు ప్రహర్ష, ప్రసిద్ద ఎఫ్ఓల చైర్మన్లు, డైరెక్టర్లు, సీఈవోలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హుస్నాబాద్ ఎసిపి వాసాల సతీష్

### వివాదాస్పద ప్రదేశాలలో గణేష్ మండపాలు ఏర్పాటు చేయవద్దు : ఎసిపి

**హుస్నాబాద్, సెప్టెంబరు 6, ప్రభాతవార్త :** వివాదాస్పద ప్రదేశాలలో గణేష్ మండపాలు ఏర్పాటు చేయవద్దని ఎసిపి వాసాల సతీష్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి, పోలీస్ కమిషనర్ అనురాధల ఆదేశాల మేరకు గణేష్ మండపాలు, ఆర్గనైజర్లతో మండల ప్రజాపరిషత్ అధికారి వేణుగోపాల్‌రెడ్డి, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఎస్ఐ తోట మహేష్‌తోకలసి సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూసుకోవాలన్నారు. నిర్వాహకులు తప్పనిసరిగా పోలీస్, విద్యుత్‌శాఖల అధికారుల అనుమతులు తీసుకోవాలని చెప్పారు. వినాయక ప్రతిష్ట నుండి నిమజ్జనం వరకు పోలీస్ బందోబస్త్ పటిష్టంగా ఉంటుందన్నారు. మండపాలు ఏర్పాటు చేసే సమయంలో నిర్వాహకులు రోడ్లు ఆక్రమించవద్దని సూచించారు.ప్రతీ మండపం వద్ద ప్రతీ రోజు కనీసం ముగ్గురు వలంటీర్లు ఉండాలన్నారు. నిమజ్జనం సమయంలో మండపాల నిర్వాహకులు పోలీస్‌ల సలహాలు పాటించాలని నమాజ్ సమయాలలో లౌడ్‌స్పీకర్లు వాడవద్దని, మసీద్‌ల వద్ద స్పీకర్లు వాడరాదని, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఉదయం 6 గంటల నుండి రాత్రి 10 గంటలవరకు మాత్రమే స్పీకర్లు వాడాలన్నారు. ఇతర మతాలను,కులాలలను రెచ్చగొట్టే విదంగా పోస్టర్లు,బ్యానర్లు ఏర్పాటుచేయవద్దన్నారు. పెద్దలు నిర్ణయించిన తేదీలలోపే నిమజ్జనాలు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధశాఖల అధికారులు, మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

### శిథిలావస్థకు చేరిన ఇళ్లల్లో ఎవరూ ఉండొద్దు

**మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న**

**హుస్నాబాద్ టౌన్, సెప్టెంబరు 6,ప్రభాతవార్త :**

హుస్నాబాద్ పట్టణ కేంద్రంలో శిథిలావస్థకు చేరిన ఇండ్లలో ఎవరూ ఉండకూడదని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న అన్నారు.శుక్రవారం రోజున పట్టణంలోని 11వ వార్డులో శిథిలావస్థకు చేరిన ఇల్లును కమిషనర్ మల్లిఖార్జున్‌గౌడ్‌తో ఆధ్వర్యంలో జెసిబిలతో కూల్చి వేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కురుస్తున్న భారీ వర్షాలకు పట్టణ కేంద్రంలో ప్రజలకు ప్రాణ,ఆస్థి నష్టం జరగకుండా ఉండేందకు వారిని పునరావాస కేంద్రాలకు తరలించి కూలిపోయే దిశకు చేరిన ఇండ్లను కూల్చుతున్నామన్నారు.ప్రజలెవరూ కూడా శిథిలమైన ఇండ్లలో ఉండవద్దని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ అయిలేని అనితశ్రీనివాస్‌రెడ్డి,కమిషనర్ మల్లిఖారు జున్‌తో పాటు తదితరులు ఉన్నారు.

**14వ వార్డులో ...**

పట్టణంలోని 14వ వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వార్డులోని ప్రజలకు తడి,పొడి చెత్తలతో పాటు పరిసరాల శుభ్రత గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో కమిషనర్‌తో పాటు మున్సిపల్ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.



శిథిలావస్తలో ఉన్న ఇళ్లను కూల్చేస్తున్న దృశ్యం

## కారోబార్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి -రాష్ట్ర అధ్యక్షుడు సాదుల శ్రీకాంత్



ప్రసంగిస్తున్న తెలంగాణ రాష్ట్ర గ్రామపంచాయితీ కారోబార్ అండ్ సిబ్బంది అధ్యక్షుడు సాదుల శ్రీకాంత్

**చిక్కడపల్లి, సెప్టెంబరు 6 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర గ్రామపంచాయితీ కారోబార్ అండ్ సిబ్బందికి సంబంధించిన సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాదుల శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగిన రాష్ట్ర స్థాయి సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా సాదుల శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా వంగ రవీందర్, కార్యదర్శిగా పండి స్వామి తదితరులు ఎన్నికైన వారిలో ఉన్నారు. అనంతరం సాదుల శ్రీకాంత్ మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో కెటిఆర్ తమ జీవితాలను 51 జీవో ద్వారా నాశనం చేశారని, ఆ పార్టీ అరాచక పాలనకు ప్రజలు విసిగెత్తి కాంగ్రెస్‌ను గెలిపించారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై నమ్మకం ఉందని ప్రగాఢంగా విశ్వసిస్తున్నామన్నారు.

### శ్రీభాష్యం శ్రావణ్‌కుమార్‌కు ఉత్తమ అధ్యాపక పురస్కారం

**చిక్కడపల్లి, సెప్టెంబరు 6 ప్రభాతవార్త:** తెలంగాణ బ్రాహ్మణ సేవాసంస్థ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్సీ సురబీ వాణి హాజరై చిక్కడపల్లి న్యూఎరా కళాశాల అధినేత, ప్రముఖ విద్యావేత్త భాష్యం శ్రావణ్‌కుమార్‌లను సత్కరించి అభినందించారు. టిబిఎస్ఎస్ అధ్యక్షుడు సురేశ్‌చందర్‌రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా ఉస్మానియా విశ్వ విద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య వేముగంటి కిషన్‌రావు, ఆధ్యాత్మిక రచయిత, ప్రవచనకర్త బ్రహ్మశ్రీ డాక్టర్ జి.శివప్రసాద్, బ్రాహ్మణ వసతి గృహ ట్రస్ట్ అధ్యక్షుడు మంత్రి రామారావు, హైకోర్టు న్యాయవాది జొన్నలగడ్డ వీరభద్రరావు, తెలంగాణ బ్రాహ్మణ సేవాసంస్థ అధ్యక్షుడు కె.సురేశ్‌చందర్‌రావు, 'వార్త' తెలుగుజాతీయ దినపత్రిక అసోసియేట్ ఎడిటర్ ఆకెళ్ళ వెంకట వరప్రసాద్, లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ చైర్మన్ గుండమరాజు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అన్నారు. శ్రావణ్‌కుమార్ న్యూఎరా కళాశాల ద్వారా విద్యార్థినీ విద్యార్థులకు మంచి విద్యను అందించడంతో పాటు ఆధ్యాత్మిక విలువలు పెంచేందుకు కృషిచేస్తున్నారని వక్తలు అభినందించారు.

## రాధాకృష్ణన్ జీవితం విద్యార్థులకు ఆదర్శం

**సైఫాబాద్, సెప్టెంబరు 6 ప్రభాతవార్త:**
ఉపాధ్యాయుడు సమాజానికి మార్గదర్శకమని, విద్యార్థుల భవిష్యత్ తరగతి గదిలో నిర్ణయమౌవుతుందని పలువురు వక్తలు తెలిపారు. డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం విద్యార్థులకు ఆదర్శమని, ఆ మహానీయుడిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని వక్తలు విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు హిందీ ప్రచార సభ హైదరాబాద్, లయన్స్ క్లబ్ ఈస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా సభ కార్యాలయంలో జరిగాయి. ఈ సందర్భంగా హిందీ ప్రచార సభ హైదరాబాద్ జనరల్ సెక్రటరీ ఎస్.గైబువల్లి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ న్యాయవాది జె.వెంకటరామ్, గౌరవ అతిథిగా నరసింహారెడ్డి, విశిష్ట అతిథులుగా లయన్స్ కబ్ల్ హైదరాబాద్ ఈస్ట్ అధ్యక్షురాలు విభాభారతి, జోనల్ చైర్మన్ అనంతకృష్ణ, హిందీ ప్రచారసభ హైదరాబాద్ పరీక్షా సంచాలకులు ప్రొఫెసర్ సురేష్‌పురీ, సంచాలక సమితి సభ్యులు విజయా వాగ్మేడే, తెలంగాణ హిందీ ప్రచార సభ అధ్యక్షుడుకె.రామచందర్, కార్యదర్శి ఎ.కె.రాజు, కన్వీనర్ కృతి కాంత్ భారతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని ఘనంగా సత్కరించారు.

### అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని ఉరి తీయాలి



అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న మహిళలు

**సైఫాబాద్, సెప్టెంబరు 6 ప్రభాతవార్త:** కొమరం భీం ఆదివాసీ జిల్లా, జైనూర్‌లో ఆదివాసీ బిడ్డపై అత్యాచారానికి పాల్పడిన షేక్ మఖ్దూమ్ అనే కిరాతకుడిని ఉరి తీయాలని డిమాండ్ చేస్తూ అనేక మంది మహిళా మోర్చా కార్యకర్తలు శుక్రవారం ట్యాంక్ బండ్ వద్దగల డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన ప్రదర్శన, ధర్నా నిర్వహించారు. బిజెపి హైదరాబాద్ సెంట్రల్ జిల్లా మహిళా మోర్చా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అనేక మంది మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా మోర్చా అధ్యక్షురాలు అనంతలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలకు భద్రతలేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. జైనూర్‌లో ఒక ఆదివాసీ బిడ్డపై అచ్యారానికి పాల్పడి, హింసించిన సంఘటన ఆమెను గాంధీ ఆసుపత్రిలో కొన ఊపిరితో చేర్పించేంతవరకు తెలియరాలేదంటే రాష్ట్రంలో మహిళలకు భద్రత ఎంత మేరకు ఉందో అర్థం చేసుకోవచ్చునని చెప్పారు. గడిచిన ఎన్నికల్లో మహిళలకు అనేక హామీలు ఇచ్చి గద్దెనెక్కిన సిఎం రేవంత్‌రెడ్డి హామీలను అమలు చేయకపోగా మహిళలకు భద్రత కల్పించడంలో ఘోరంగా విఫలం చెందారని తక్షణమే ఆయన గద్దె దిగాలని ఆమె డిమాండ్ చేశారు. కలకతా సంఘటన మరుకముందే ఆదివాసీ మహిళపై ఇంతటి అకృత్యానికి పాల్పడిన నిందితుడిని ఉరి తీయాలని ఆమె కోరారు.

## పర్యావరణ పరిరక్షణకు మట్టి గణేష్‌లనే పూజించాలి



వివేకానందనగర్ వార్డు కార్యాలయంలో మట్టి గణపతిలను అందజేస్తున్న కార్పొరేటర్ సబీహాగౌసుద్దీన్.

**యూసుఫ్‌గూడ, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త :**
పర్యావరణ పరిరక్షణ కాపాడేందుకు, వినాయక చవితి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించుకునేందుకు ప్రతి ఒక్కరు మట్టి వినాయకులను పూజించాలని మేడ్చల్ అర్బన్ జిల్లా బిజెపి సెక్రటరీ పులిగోళ్ళ శ్రీనువాస్ యాదవ్ అన్నారు. శుక్రవారం వివేకానంగనర్ కాలనీలోని శ్రీకనకదుర్గ, నల్లపోచమ్మ అమ్మవారి ఆలయం ప్రాంగణంలో స్థానికులకు మట్టి వినాయక విగ్రహాలను అందజేశారు. ఈకార్యక్రమంలో డివిజన్ బీజేపి ప్రధాన కార్యదర్శి బొంతు హరికృష్ణ, ఆలయ అర్చకులు శరత్, గంగాధర్, శ్రీనువాస్ గోపి, రవి, రజిత, లక్ష్మీ, అనురాధ, ధనలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

## గౌలిదొడ్డి గురుకుల కళాశాలను సందర్శించిన మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు

**-విద్యార్థులు రోడ్డు మీదకు వచ్చి ధర్నా చేసే స్థితికి తీసుకువచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం : మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి**



విద్యార్థులతో మాట్లాడుతున్న బిఆర్ఎస్ మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు

**గచ్చిబౌలి, సెప్టెంబరు 6 ప్రభాతవార్త**
దేశంలోనే కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉండాలనే ఉద్దేశ్యంతో తెలంగాణ మొదటి ముఖ్యమంత్రి కెసిఆర్ గురుకుల పాఠశాలలను అత్యుత్తమంగా తీర్చిదిద్దారని, కానీ నేడు గురుకుల కళాశాలల విద్యార్థులు తమ సమస్యల పరిష్కారం కోసం రోడ్డు మీదకు వచ్చి ధర్నా చేసే స్థితికి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిందని తెలంగాణ మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి అన్నారు. గౌలిదొడ్డిలోని సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను ప్రభుత్వం తొలగించడంపై విద్యార్థులు ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. పాత ఫ్యాకల్టీని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ గౌలిదొడ్డి గురుకుల బాలురు, బాలికల కళాశాలల్లో విద్యార్థులు చేపట్టిన ఆందోళనకు బిఆర్ఎస్ నాయకులు మద్దతు తెలిపారు. శుక్రవారం గౌలిదొడ్డి గురుకుల కళాశాలకు వచ్చిన బిఆర్ఎస్ మాజీ మంత్రులు జగదీష్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, బిఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు చంటి క్రాంతికిరణ్, బాల్క సుమన్, గువ్వల బాలరాజులు విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు రెండు కళాశాలల్లో పనిచేస్తున్న సబ్జెక్ట్ టూ అసోసియేట్స్ 16 మందిని విద్యా సంవత్సరం మధ్యలో ప్రభుత్వం తొలగించిందన్నారు. దీని కారణంగా తమ చదువులపై తీవ్ర ప్రభావం పడుతుందని, విద్యా సంవత్సరం మధ్యలో కొత్త ప్యాకల్టీ కారణంగా తాము ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ విషయమై మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ గురుకుల కళాశాలలను ప్రైవేటు కళాశాలలకు దీటుగా తీర్చిదిద్దారన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యార్థులు ఎన్నో సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ గత పదేళ్ల కాలంలో ఒక్కో ఇటుక పేర్చినట్టు గురుకుల కళాశాలలను ఉత్తమంగా తీర్చిదిద్దామని, నాటి ముఖ్యమంత్రి కెసిఆర్ సహకారంతో అత్యుత్తమ వసతులు కల్పించామన్నారు. విద్యార్థులకు మంచి విద్యను అందించాలనే ఉద్దేశ్యంతో ఓపెన్ మార్కెట్‌లో ఉత్తమ ఉపాధ్యాయులను గుర్తించి కాంట్రాక్టు పద్ధతిలో రిక్రూట్ చేసుకున్నట్లు తెలిపారు. కానీ నేడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం పేద విద్యార్థులకు ఉత్తమ విద్యను దూరం చేయాలనే అలోచనతో విద్యా సంవత్సరం మధ్యలో ఫ్యాకల్టీలను తొలగించారని వాపోయారు. విద్యార్థులకు అండగా బిఆర్ఎస్ పార్టీ ఉంటుందని తెలిపారు. కాగా తొలగించిన 16మంది కాంట్రాక్టు ఫ్యాకల్టీలలో 13మందిని తిరిగి తీసుకుంటున్నట్లు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయని ప్రిన్సిపాల్ చెప్పారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు గెల్లు శ్రీనివాస్, శేరిలింగంపల్లి బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొమిరిశెట్టి సాయిబాబా పాల్గొన్నారు

### గణేష్ మండపాన్ని కూల్చిన జిహెచ్ఎంసి అధికారులు

**పేట్ బషీరాబాద్, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త**
ఎంఎన్‌రెడ్డి కాలనీ ఫేస్ 1లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాన్ని జిహెచ్ఎంసి అధికారులు కూల్చివేశారు. ఈ విషయమై కాలనీ అధ్యక్షులు సంపత్‌గౌడ్ జిహెచ్ఎంసి అధికారులను సంప్రదించగా బుధవారం సాయంత్రం ఎన్ఎంరెడ్డి కాలనీలో కూరగాయల మార్కెట్ జరిగిందని చెత్త తీయడానికి జిహెచ్ఎంసి నుండి ఎలాంటి సిబ్బంది రాలేదని, జిహెచ్ఎంసి వారు గురువారం ఉదయం వచ్చారని, గురువారం ఉదయం వచ్చిన తర్వాత చెత్త తీయడంలో జాప్యం జరిగిందని, గురువారం రాత్రి 2 గంటలకు జెసిబి వచ్చి చెత్త తీస్తున్న సందర్భంగా ఇట్టి సంఘటన జరిగిందని తెలియజేశారు. కానీ కాలనీవాసులు చెప్పిన విషయం ఏమనగా గణపతి మండపం కింద ఉన్న చెత్తను తీయమని అధికారులను అడిగినందుకే ఇలాంటి దుస్సహాసానికి పాల్పడ్డారని, తెలియజేశారు. ఇట్టి దుస్సహాసానికి పాల్పడిన జిహెచ్ఎంసి అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు. ఈ విషయమై 100కు ఫోన్ చేయగా పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ నుంచి పోలీసులు వచ్చి ఫిర్యాదు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారని కాలనీ అధ్యక్షులు సంపత్ గౌడ్, కాలనీ వాసులు తెలియజేశారు.

## పోచారంలో కబ్జాకు పాల్పడిన వారిని అరెస్టు చేయాలి

**చిక్కడపల్లి, సెప్టెంబరు 6 ప్రభాతవార్త:** రాష్ట్రంలో మేడ్చల్ జిల్లా పోచారం మున్సిపల్ పరిధిలోని అన్సోజిగూడ గాయత్రి గుడి పక్కన ఎఫ్‌టిఎల్‌లో ఉన్న మిరాలకుంట చెరువును కబ్జాకు గురిచేసిన పోచారం మున్సిపల్ చైర్మన్ వి.కొండల్‌రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు ఎన్.శేఖర్‌లను వెంటనే అరెస్టు చేసి సమగ్ర విచారణ చేపట్టాలని పోచారం మున్సిపల్ 10వ వార్డు కౌన్సిలర్ బాలగౌని వెంకటేశ్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాగ్‌లింగంపల్లిలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బతుకమ్మఘాట్ పేరుతో సుమారు వెయ్యి నుంచి రెండు వేల గజాల వరకు చెరువులో మట్టినింపి చెరువు ఆనవాలు లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకపక్క చుట్టు భారీ నిర్మాణాలు చేపట్టి మిగిలి ఉన్న మిరాలకుంట మాయమవుతున్నా ప్రభుత్వ అధికారులు పట్టీపట్టనట్లుగా వ్యవహరించారని విమర్శించారు. పలుమార్లుమట్టి తొలగించాలని నోటీసులు జారీ చేసినా స్పందించలేదని, గతంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం జరిగిందని, ఇదే విషయంపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, హైడ్రా కమిషనర్ రంగనాథ్‌లకు ఫిర్యాదు చేశారన్నారు.

### గణేష్ ఉత్సవాలను విజయవంతంగా జరుపుకోవాలి

**యూసుఫ్‌గూడ, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త :**
గణేష్ పండుగ పర్వదినాలను కలిసికట్టుగా జరుపుకుంటూ ఉత్సవాలను విజయవంతంగా జరుపుకోవాలని కార్పొరేటర్ సబీహాగౌసుద్దీన్ అన్నారు. శుక్రవారం శ్రీవివేకానందనగర్ ఆవార్డు కార్యాలయంలో జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొని భక్తులకు స్థానికులకు అందజేశారు. హైదరాబాద్ నగరంలో ప్రతి పండుగ ఉత్సవాలను కులమతాలకు అతీతంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని గణపతి నవరాత్రి ఉత్సవాలను కూడా విజయవంతంగా నిర్వహించుకునేందుకు ఒకరికొకరు సహరించుకువాలని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ కోఆర్డినేటర్ వీరారెడ్డి, జ్ఞానేశ్వర్, వివేకానందనగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు బొల్లు శ్రీనువాస్ రావు, విజయ్‌గౌడ్, బ్రహ్మం, కమల్, రవిందర్‌రెడ్డి, లక్ష్మీ, అమ్ములు, ఇందిర, తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమ శిఖరం జిట్టా బాలక్రిష్ణారెడ్డి

**-తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి**

**ముషీరాబాద్, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త:**
ఉద్యమ శిఖరం జిట్టా బాలక్రిష్ణారెడ్డి మరణం యావత్ తెలంగాణ సమాజానికి తీరని లోటని తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం యువజన సమాఖ్య సంఘాల అధ్యక్షులు జిట్టా బాలక్రిష్ణారెడ్డి మృతి చెందటం పట్ల తెలంగాణ న్యాయవాదులు విచారం వ్యక్తం చేశారు. బాలక్రిష్ణారెడ్డికిని వాళులర్పించిన అనంతరం గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ మలిదశ తెలంగాణ ఉద్యమంలో అవిశ్రాంతం పోరాడిన సహచర ఉద్యమకారుడు జిట్టా బాలక్రిష్ణారెడ్డి అకాల మరణం ఎంతో బాధాకరమన్నారు.

### పర్యావరణ హితం కోసం మట్టి గణపతులను పూజించాలి : ఎమ్మెల్యే శ్రీనివాస్ యాదవ్



మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న తలసాని

**సంజీవరెడ్డి నగర్, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త**
పర్యావరణ హితం కోసం మట్టి గణపతులను పూజించాలని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం వెస్ట్ మారేడ్ పల్లిలోని తన కార్యాలయం వద్ద మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హానికరమైన రంగులు, ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్‌లతో చేసిన విగ్రహాల వలన నిమజ్జనం చేసిన నీటి వనరులు కలుషితమయ్యే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నార్త్‌జోన్ డిప్యూటీ మున్సిపల్ కమీషనర్ సమ్మయ్య, అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, నాయకులు కూతరు నర్సింహ, కట్ట బలరాం తదితరులు పాల్గొన్నారు.

### గంగయ్య బస్తీలో పర్యటించిన ఎమ్మెల్యే గణేష్



బస్తీలో పర్యటిస్తూ బస్తీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణేష్

**సంజీవరెడ్డి నగర్, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త**
సికింద్రాబాద్ కంటోన్మెంట్ వార్డ్ 7 గంగయ్య బస్తీలో శుక్రవారం ఎమ్మెల్యే గణేస్ పర్యటించారు. అక్కడి ప్రజల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా నాలా సమస్యను అక్కడి ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. బస్తీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. జంగయ్య బస్తీ పాఠశాల వద్ద యువకులు గంజాయి తాగుతున్నారని, మారెనకట్ వ్యర్థాలని ఓపెన్ నాలాలో పడేస్తున్నారని ప్రజలు ఎమ్మెల్యేకు తెలియజేశారు. ఎమ్మెల్యే స్పందిస్తూ వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి యుద్ధ ప్రాతిపదికన సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జులైస్ సంతోస్, శ్రీను, సాయి కుమార్, సుధీర్ కుమార్, పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

**ముషీరాబాద్, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త:**
గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచవల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లో ఉన్న జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సొసైటీ నాయకులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో సొసైటీ అధ్యక్షులు మామిడి సోమయ్య అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఇళ్ల స్థలాల సమస్యపై చర్చించి, తీర్మానాలు ఆమోదించారు. ఈ సందర్భంగా మామిడి సోమయ్య, కార్యదర్శి బొల్లం శ్రీనివాస్ తదితరులు మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉందని, గత ప్రభుత్వం జర్నలిస్టులకు ఇళ్లు ఇస్తామని చెబుతూనే ఇవ్వకుండా మోసం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి ఇళ్ల స్థలాల సమస్యను తీసుకురావటం, దీనిపై చర్చించటం జరిగిందని, ముఖ్యమంత్రి కూడా అర్హులైన జర్నలిస్టులు అందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. 2008లో ఏర్పడిన మన సొసైటీ సభ్యులందరికీ త్వరలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇండ్ల స్థలాలు ఇస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కోశాధికారి తన్నీరు శ్రీనివాస్, డైరెక్టర్లు యర్రమిల్లి రామారావు, గజ్జెల వీరేశం, భాస్కర్‌రెడ్డి, మహిళా సభ్యులు పి.నాగవాణి, శాంతి, జర్నలిస్టుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆనంచిన్ని వెంకటేశ్వరరావు, ఆలిండియా వర్కింగ్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు కె.కోటేశ్వరరావు, పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

**-మట్టి విగ్రహాలను పూజించాలి**
**-నిమజ్జన ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే**



అత్తాపూర్ సెప్టెంబర్6, ప్రభాతవార్త : గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతవారణంలో ఘనంగా జరుపుకోవాలని ప్రతి ఒక్కరూ కూడా పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలను పూజించాలని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం రాజేంద్రనగర్ పరిధిలోని పత్తికుంటలో వినాయక నిమజ్జనానికి చేపడుతున్న ఏర్పాట్లును డిసి రవి కుమార్, సిఐ కాస్ట్రో, వివిధ పార్టీల నేతలతో కలిసి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా నిమజ్జనానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ....గణేష్ మండపల నిర్వాహకులు అధికారుల సూచనలు పాటిస్తూ వారికి సహకరించాలని భక్తి శ్రద్ధలతో ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలని సూచించారు. గణేష్ నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా కులమతాలకతీతంగా వేడుకలను నిర్వహించుకోవాలని తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కోరని దయానంద, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు శ్రీధర్, పంబల రాజు, కెన్ని వేణు, తదితరులు పాల్గొన్నారు.

# కమలానగర్ విజయ గణపతికి ప్రాణప్రతిష్ట

**-31 అడుగుల విగ్రహానికి శిల్పి రాజేంద్రన్ రూపకల్పన**
**-స్వామివారికి వచ్చిన కానుకలు వరద బాధితులకు అందజేస్తామన్న నిర్వాహకులు**



గణపతి ప్రాణ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న నిర్వాహకులు,

**ఎల్.బి.నగర్, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:** చైతన్యపురి కమలనగర్‌లోని విజయ గణపతి విగ్రహానికి శుక్రవారం శిల్పి చిన్నస్వామి రాజేంద్రన్ కంటిపాపను అమర్చి ప్రాణ ప్రతిష్ట చేశారు. శ్రీమణికంఠ అయ్యప్ప భక్త సమాజం ఆధ్వర్యంలో గత 20 సంవత్సరాలుగా వినాయక చవితి సందర్భంగా భారీ గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తారు. ఈ సంవత్సరం 31 అడుగుల భారీ మట్టి విజయగణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. 9 రోజులపాటు ఉదయం, సాయంత్రం స్వామివారి మండపం వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని శ్రీమణికంఠ అయ్యప్ప భక్త సమాజం చైర్మన్ తులసి శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 14వ తేదీన శివపార్వతి శాంతి కళ్యాణ మహోత్సవం, 15వ తేదీన నిమజ్జనం సందర్భంగా 51 కిలోల కర్పూరంతో మహా మంగళహారతి నిర్వహిస్తామని తెలిపారు. నవరాత్రుల సందర్భంగా భక్తుల నుంచి వచ్చే కానుకలను పూర్తిగా భారి వర్షాల కారణంగా నష్టపోయిన వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి అందజేస్తామన్నారు. నగరంలో ఖైరతాబాద్ తర్వాత అత్యంత భారీ విగ్రహం కమలనగర్‌లో ఏర్పాటు చేస్తుండదంతో రాష్ట్రానికి చెందిన పలువురు న్యాయమూర్తులు, మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో శిల్పి చిన్నస్వామి రాజేంద్రన్, కోచైర్మన్ బాబురావు, ప్రధానకార్యదర్శి నాగేంద్రకుమార్, సలహాదారులు పి.విశ్వనాథరాజు, కృష్ణమూర్తి, పి.సిద్ధార్థ, క్రాంతికుమార్, పిఎల్.రాంప్రసాద్, జగదీష్, ప్రసాద్, బి.వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## ఐటి రంగంలో సాఫ్ట్‌వేర్ కంపెనీల మోసాలను ప్రభుత్వం అరికట్టాలి

**-సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.ఎస్.బోస్ డిమాండ్**

**సైఫాబాద్, సెప్టెంబరు 6 ప్రభాతవార్త:**
హైదరాబాద్ దేశంలోని అనేక నగరాలతోపాటు సాఫ్ట్‌వేర్ రంగంలో గుర్తింపు పొందిన కేంద్రంగా నిలబడిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.ఎస్.బోస్ చెప్పారు. ఇటీవల కాలంలో సాఫ్టెవేర్ ఉద్యోగులను అన్యాయంగా తొలగించడం లేకపోతే లే ఆఫ్ చేయడం సర్వసా ధారణమయ్యిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రంగంలో అనేక విధాలుగా పుట్టుకొస్తున్న సార్టప్ కంపెనీలు ఏలాంటి నియమ నిబంధనలు లేకుండా ఉద్యోగులను తొల గించడం దుర్మార్గమైన చర్యగా ఆయన పేర్కొన్నారు. కరోనా కాలంలో మొదలై నేటి వరకు ఆదే బాటన ఈ కంపెనీలు సాఫ్టెవేర్ ఉద్యోగులను భయబ్రాంతులకు గురిచే స్తూ ఉద్యోగాలకు భరోసా లేకుండా చేస్తున్నాయని, గత ఏడాది లక్షన్నర మంది ఉద్యోగులను తొలగించినట్లుగా లెక్కలు ఉన్నాయని, మళ్ళీ ఈ ఏడాది మరో 30 వేల మం ది ఉద్యోగులను లే ఆఫ్ రూపంలో ఉద్యోగాల నుంచి తొల గించినట్లు తెలుస్తున్నదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌ను ప్రపంచ పఠంలో అత్యంత ప్రధానమైన నగరంగా ఐటి రంగంతోపాటు క్రీడా రంగంగంలోనూ ఆర్టిఫిషియల్ ఇంటలిజెంట్‌లో ప్రధాన పాత్ర పోషించాలని చేస్తున్న కృషికి అనుకూలంగా ఉన్నట్లు కనిపించడంలేదని ఆరోపించారు. భవిష్యత్తులో వచ్చే ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్సీని దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచి ఐటి రంగంలో ఉద్యోగులను తొలగించడం ద్వారా వాటి లాభాలను పెంచుకునే దురుద్దేశంతో ఉద్యోగులను తొలగించడటం లేక లే ఆఫ్ చేయడం జరుగుతున్నదని భావిస్తున్నామన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని ఐటి రంగంలో సాఫ్ట్‌వేర్ కంపెనీలు చేస్తున్న మోసాలను అరికట్టి ఉద్యోగులకు సరైన న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## టాటా నెక్సన్ ఈవీ వినియోగదారుని ఫిర్యాదుపై డిసిఐసి ఫోరం ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న రంగయ్య

**సైఫాబాద్, సెప్టెంబరు 6 ప్రభాతవార్త:** ప్రముఖ దేశీయ వాహన తయారీ సంస్థ టాటా కార్స్‌పై హైదరాబాద్ కన్స్యూమర్ ఇన్ఫర్మేషన్ (డిసిఐసి) అగ్రహం వ్యక్తం చేసింది. టాటా నెక్సన్ ఈవీ కారు వినియోగదారుని ఫిర్యాదు మేరకు సంస్థ నిర్లక్ష్యంగా, బాధ్యతారాహిత్యాన్ని ఎత్తి చూపింది. శుక్రవారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ అధ్యక్షుడు ఎస్‌సిహెచ్ రంగయ్య, వాహనం బాధితుడు రంగపవన్, కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ఏడుకొండలుతో కలిసి మాట్లాడుతూ లక్షల రూపాయలు పోసి ఖరీదు చేసిన కారు 101 తీరు సమస్యలతో వినియోగదారుడిని ముప్పుతిప్పలు పెట్టిందని ఆరోపించారు. గత నవంబరు నెలలో 24 లక్షల రూపాయలు వెచ్చించి రంగపవన్ నగరంలో టాటా నెక్సన్ ఈవీ కారును కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ఈ కారును కొన్న తరువాత అనేక సమస్యలు వచ్చాయని బాధితుడు డీలర్‌కు అనేక సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, 8, 9 నెలల్లో కారును 20 సార్లు సర్వీస్‌కు తీసుకువెళ్లవలసి వచ్చిందన్నారు. దీంతో బాధితుడు హైదరాబాద్ జిల్లా వినియోగదారుల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. వినియోగదారుని ఫిర్యాదును పట్టించుకోకపోవడం దారుణమని డిసిఐసి అధ్యక్షుడు చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారని, ఈ కారు స్టీరింగ్, యాక్సిలేటర్ వంటి ముఖ్యమైన భాగాలు పనిచేయకపోవడం వినియోగదారునికి ప్రమాదకర అనుభవాలు కలిగిందని చెప్పారని ఆయన వివరించారు. టాటా నెక్సన్ ఈవి అమ్మకాలను తక్షణమే ఆపి, సంస్థ లైసెన్స్‌ను రద్దు చేయాలని రంగయ్య డిమాండ్ చేశారు.

# లోన్ యాప్ వేధింపులకు ఎంసిఏ విద్యార్థి మృతి..

**పేట్ బషీరాబాద్, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త**
లోన్ యాప్ వేధింపులతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, మృతుడి స్నేహితులు తెలిపిన వివరాల ప్రకారం వికారాబాద్ జిల్లా మద్దూర్ మండల కేంద్రానికి చెందిన రమండ్ల బాలనర్సింహులు క్రిష్ణవేణి దంపతులతో పాటు తమ కొడుకు భానుప్రకాశ్ (22) గత కొన్నెండ్ల కిందటన నగరానికి వలస వచ్చి షాపూర్‌నగర్ సంజయ్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. కాగా తన తండ్రి బాలనర్సింహులు గత కొన్ని నెలల కిందటనే మృతి చెందగా, తన తల్లితో ఉంటున్న భానుప్రకాశ్ రామాంతాపూర్‌లోని అరోరా కళాశాలలో ఎంసిఏ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. భానుప్రకాశ్ అప్పడప్పుడు తన టెలిగ్రాం యాప్ ద్వారా వచ్చిన సందేశాలతో ఓ లోన్‌యాప్‌లో పెట్టిన పెట్టుబడికి మొదటిసారిగా లాభాలు చూపించారు. ఏకకాలంలో పెద్దమొ త్తంలో పెట్టుబడి పెట్టేంత వరకు ఆస్కారం కల్పించడంతో తన మిత్రులు, ఇతర తెలిసిన వారి వద్ద అప్పు చేసి సుమారు రూ.65 వేలు యాప్ ద్వారా నగదును చూపించాడు. అయితే పెట్టిన నగదుతో పాటు లాభాన్ని తన లోన్ యాపన ఖాతాలో జమ కాలేదు. దీంతో పలుమార్లు తన యాప్ ద్వారా మెస్సేజ్ రూపంలో అడిగే ప్రయత్నం చేయగా.. అక్కడి నుండి తన ఖాతాలో రూ.10లక్షల బ్యాలెన్స్ ఉంటేనే వస్తుందని లేకుంటే రావని సమాధానం వచ్చింది. దీంతో తాను అప్పు చేసిన వ్యక్తులు డబ్బులు అడగడంతో తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. గురువారం రాత్రి సమయంలో ఇంట్లో తన తల్లికి చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోకపోవడంతో తన తల్లి ఫోన్ చేయగా ఫోన్ తీయకపోవడంతో తన స్నేహితులకు చేసింది. దీంతో స్నేహితులు రాలేదని సమాధానం ఇవ్వడంతో అతడి ఆచూకి కోసం సెల్‌ఫోన్‌లో గూగుల్ యాప్ ద్వారా వెతకడంతో జీడిమెట్ల ఫాక్స్ సాగర్ చెరువు వద్ద చూపించింది. అక్కడికి వెళ్లి చూడగా చెరువు కట్టపై మృతుడికి సంబంధించిన వస్తువులు, సెల్‌ఫోన్, ద్విచక్ర వాహనంలో ఉండడంతో చుట్టపక్కల వెతికినా కన్పించలేదు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో శుక్రవారం ఉదయం ఎన్‌డీఆర్ఎఫ్ బృందంతో చెరువులో గాలించి మృతదేహాన్ని వెలికితీసి గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేర కు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ప్లాస్టిక్ వాడకం తగ్గించి పర్యావరణం కాపాడుకుందాం

**- నార్సింగి మున్సిపల్ కమిషనర్ కృష్ణ మోహన్‌రెడ్డి**

**నార్సింగి, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త :**
గణపతి మండప నిర్వాహకులందరూ ఈ సారి వేడుకలను పర్యావరణ హితంగా జరుపుకుందామని నార్సింగి మున్సిపల్ కమీషనర్ కృష్ణ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నార్సింగి మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గణపతి మండప నిర్వాహకులంతా బ్యానర్లు, జెండాలు అన్నీ ప్లాస్టిక్‌తో తయారు చేసినవి కాకుండా, బట్టతో తయారు చేసినవి వాడుకోవాలని సూచించారు. అలాగే అన్నదానం నిర్వహించే మండప నిర్వాహకులు సైతం ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లను వాడవద్దని తెలిపారు. బొజ్జ గణపయ్యలను కూడా రసాయనలతో తయారు చసినవి కాకుండా మట్టి గణపయ్యలను ప్రతిష్టించుకొని, భక్తి శ్రద్ధలతో కొలువాలని తెలిపారు. హంగు ఆర్భాటాలకు పోకుండా భక్తి, మన సంస్కృతి, సాంప్రదాయాలను పాటించాలని, భావి పౌరులైన పిల్లలకు మన సంస్కృతి గొప్పతనంను వివరించాలని సూచించారు. పండగ వేళల్లో కూడా మనదైన సనాతన సంస్కృతిని పాటించకుండా మండపాల వద్ద డిజెలు పెట్టి, వెస్టర్న్ పాటలు పెట్టి డ్యాన్సులు చేయడం మానుకోవాలని తెలిపారు. గ్రామ పెద్దలు, మండపాల నిర్వాహకులు ఈ అంశంపై దృష్టి సారించాలని, ప్లాస్టిక్ వాడకంను మానుకోవాలని కమీషనర్ స్పష్టం చేశారు. ముందు జాగ్రత్తగా సూచనలు చేశామని, ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి ప్లాస్టిక్‌ను వాడినట్లయితే అపరాధ రుసుము చెల్లించేందుకు సిద్దంగా ఉండాలని తెలిపారు.

## మట్టి గణపతి పూజలతోనే పర్యావరణ పరిరక్షణ

**-ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్**



మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్

**చిక్కడపల్లి, సెప్టెంబరు 6 ప్రభాతవార్త:**
మట్టి గణపతిని పూజించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. గాంధీ నగర్ డివిజన్‌లోని సిద్దంశెట్టి అపార్ట్‌మెంట్ ఆవరణలో బిఆర్ఎస్ సీనియర్ నేత ముఠానరేశ్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ముఖ్యఅతిథిగా ముఠాగోపాల్‌హాజరై విగ్రహాలను బిఆర్ఎస్ యువనేత ముఠాజయసింహాతో కలిసి పంపిణీ చేసి ప్రసంగించారు. వినాయక చవితి పర్యదినానికి హానికర రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలను కాకుండా మట్టి ప్రతిమలను పూజిస్తే జలవనరులకు మేలు చేసిన వారౌతారన్నారు. వినాయక విగ్రహాల అలంకరణలో, పూజలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్, థర్మాకోల్ వాడొద్దని సూచించారు. మట్టి విగ్రహాలను వాడటం వల్ల, అవి పర్యావరణానికి హాని చేయకుండా, నీటిలో సులువుగా కరిగిపోతాయన్నారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఎం.రాకేశ్‌కుమార్, నేతలు శ్రీకాంత్, ముచ్చకుర్తి ప్రభాకర్, ఆకుల శ్రీనివాస్, గడ్డమీది శ్రీనివాస్, వెంకటేశ్, పుట్టనవీన్‌యాదవ్, కుమారస్వామి, సుధాకర్, ఎం.వి.అశోక్ కుమార్, అరుణశ్రీ తదితరులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్ఐ అభిలాష్

## ప్రశాంత వాతావరణంలో పండగ జరుపుకోవాలి

**కోహెడ, సెప్టెంబరు 6, ప్రభాతవార్త :** గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో చేసుకోవాలని ఎస్ఐ అభిలాష్ కోరారు. శుక్రవారం కోహెడ పోలీస్ స్టేషన్‌లో నేడు(శనివారం) వినాయక చవితి పండగ సందర్భంగా గణేష్ మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతి, మత, కుల, వర్గం అనే బేదాలు లేకుండా అందరూ కలసి మెలిసి ఉండాలని, ప్రతీ ఒక్కరు మతసామరస్యం కాపాడుకోవాలన్నారు. ఈమధ్యకాలంలో చిన్న, చిన్న సంఘటనలు జరిగినా సోషల్ మీడియా ద్వారా వైరల్ చేస్తున్నారని, అది సమాజానికి మంచిది కాదన్నారు. సామాజిక మాధ్యమాల్లో ఎవరైనా మతాలను, కులాలలను రెచ్చగొట్టే పోస్టులు పెడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో గణేష్ మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

## వినాయక మండపాలకు అనుమతి తీసుకోవాలి

### మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్

**హుస్నాబాద్, సెప్టెంబరు 6, ప్రభాతవార్త :** వినాయక మండపాల ఏర్పాటుకు నిర్వాహకులు పోలీసుల అనుమతి తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో గణేష్‌మండపాల నిర్వాహకులతో తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఎస్ఐ తోట మహేష్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వినాయక మండపాల నిర్వహకులు ఆన్‌లైన్‌లో పోలీస్, విద్యుత్‌శాఖ అధికారుల అనుమతులు తీసుకోవాలన్నారు. అలాగే మండపాల్లో డిజేలు వాడవద్దని చెప్పారు. అంతే కాకుండా అన్నదానం నిర్వహించే సమయంలో ప్లాస్టిక్ ప్లేట్‌లు, గ్లాసులకు బదులు స్టీల్ బ్యాంక్ వాడుకోవాలని కోరారు. సమావేశంలో కౌన్సిలర్లు కొంకటి నళినిరవి, కోమటి స్వర్ణలత, చిత్తారి పద్మ, మ్యాదబోయిన వేణుయాదవ్, శ్రీనివాస్, రవి, వల్లపు రాజు, బొజ్జ హరీష్‌తో పాటు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## పత్తి పంటలో పారావిల్ట్ నివారణకు చర్యలు చేపట్టాలి


ఇటిక్యాలలో పత్తి పంటను పరిశీలిస్తున్న ఏడిఏ అనిల్‌కుమార్

**జగదేవ్‌పూర్, సెప్టెంబర్ 6 (ప్రభాతవార్త):** కొద్దిరోజులుగా కురిసిన అధిక వర్షాలతో పత్తి పంటలో పారా విల్ట్ లక్షణాలు కనబడుతున్నాయని వాటి నివారణకు రైతులు వెంటనే చర్యలు చేపట్టాలని ములుగు డివిజన్ ఏడిఏ అనిల్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఇటిక్యాల, అలిరాజపేట తదితర గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న పత్తి పంటలను జగదేవ్‌పూర్ మండల వ్యవసాయాధికారి వసంతరావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక వర్షాల వల్ల పత్తి పంటలో పారా విల్ట్ అధికంగా ఉండడం గమనించడం జరిగిందని, ఇది పొలంలో చెదురుమదురుగా కొన్ని ప్రాంతాల్లో కనిపిస్తుందని, దీని లక్షణాలు ఇతర తెగుళ్ల లక్షణాలకు పోలిక ఉండడం వల్ల రైతులను అయోమయానికి గురిచేస్తుందని, పారా విల్ట్ లక్షణం పత్తి పంట ఎండిపోవడం, రంగు మారిపోవడమని, ఈ పారా విల్ట్ నివారణకు రైతులు పంటలో నిల్వ నీటిని బయటకు పంపించాలని, సాధ్యమైనంత వరకు పత్తి పంట వేర్లకు గాలి తగిలేలా చూసుకోవాలని, తర్వాత లీటరు నీటికి 5 గ్రాముల 19-19-19 లేదా 10-0-45 లేదా 3 గ్రాముల కాపర్ ఆక్సీ క్లోరైడ్ కలిపి ద్రావణాన్ని తయారుచేసి మొక్కల వేర్లు తడిచేలా పోసుకోవాలని సూచించారు. పంట మార్పిడి చేసినా రైతు పొలాలలో దీని ప్రభావం ఎక్కువగా లేదని, అందువల్ల రైతులు ప్రతిసారి ఒకే పంటను సాగు చేయకుండా పంట మార్పిడి చేసుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పంటలు నష్టపోయిన రైతులను గుర్తించి ప్రభుత్వానికి నివేదిక పంపుతామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు ఖలీల్, భానుప్రకాష్, శరణ్య, సమత పాల్గొన్నారు.

## మట్టి వినాయకులు పంపిణీ



మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, పాలకవర్గం

**గజ్వేల్‌టౌన్, సెప్టెంబర్ 6(ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయం వద్ద శుక్రవారం మున్సిపల్ చైర్మన్ ఎన్.సి.రాజమౌళి పాలక వర్గ సభ్యులతో కలిసి మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. మట్టి వినాయకులను పూజించి పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య, వైస్ చైర్మన్ జకియొద్దీన్, కౌన్సిలర్లు ఉప్పల మెట్టయ్య, తలకొక్కుల భాగ్యలక్ష్మి దుర్గాప్రసాద్, గంగిశెట్టి చందన రవీందర్, మామిడి విద్యారాణి శ్రీధర్, శీర్ల శ్యామల మల్లేష్‌యాదవ్, కో-ఆప్షన్ సభ్యులు గంగిశెట్టి రాజు, మున్సిపల్ సిబ్బంది, మెప్మా సరిత పాల్గొన్నారు.

## బివిఆర్ఐటిలో ముగిసిన జాతీయ స్థాయి 24 గంటల డిమక్స్ హ్యాకథాన్

**నర్సాపూర్, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త:**
నర్సాపూర్ సమీపంలోని బివిఆర్ఐటి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం జాతీయస్థాయి 24 గంటల డిమక్స్ హ్యాకథాన్ కార్యక్రమం ఘనంగా ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టెక్ మహేంద్ర కంపెనీకి చెందిన డెలివరి హెడ్ శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. ఈ హ్యాకథాన్ కార్యక్రమంలో సాఫ్ట్ వేర్ విభాగంలో వాసవీ ఇంజనీరింగ్ కళాశాల, హార్డ్‌వేర్ విభాగంలో నర్సాపూర్ బివిఆర్ఐటి విద్యార్థులు మొదటి విజేతలుగా నిలిచారు. సాఫ్ట్‌వేర్ విభాగంలో హైద్రాబాద్ బివిఆర్ఐటి రెండవ స్థానంలో, గోకరాజు ఇంజనీరింగ్ కళాశాల మూడవ స్థానంలో విజేతలుగా నిలిచారు. ఎస్ఆర్ యూనివర్సిటి, వియన్ఆర్ కళాశాల, ఐఐటి భీమవరంకు కన్సోలేషన్ విభాగంలో విజేతలుగా నిలిచారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను ముఖ్యఅతిథులతో పాటు కళాశాల డైరక్టర్ "డాక్టర్ లక్ష్మి ప్రసాద్, సిఎస్‌బిఎస్ విభాగ అధిపతి డాక్టర్ బీమా లు అభినందించారు. అనంతరం విజేతలకు మొత్తంగా 50 వేల రూపాయిల నగదు బహుమానం అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ బీమా కళాశాల చైర్మన్ కె.వి. విష్ణురాజుకు, వైస్ చైర్మన్ రవిచంద్రన్‌రాజగోపాల్, సెక్రటరీ ఆదిత్య విస్సం, డైరక్టర్ డాక్టర్ లక్ష్మి ప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ సంజయ్ దూబే, మేనేజర్ బాపిరాజు, ఏవో అశోక్‌రెడ్డి లకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఎమ్మెల్యే సునీతారెడ్డిని విమర్శిస్తే సహించేది లేదు

### మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమొద్దీన్, మాజీ ఎంపిటిసి సత్యంగౌడ్


మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

**నర్సాపూర్, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త:**
ఎమ్మెల్యే సునీతారెడ్డి హయాంలోనే నర్సాపూర్ నియోజక వర్గం అభివృద్ధి చెందిందని మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమొద్దీన్, మాజీ ఎంపిటీసి సత్యం గౌడ్, మండల అధ్యక్షుడు బోగ శేఖర్, మాజీ జడ్పిటీసి బాబ్యనాయక్, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ శివ కుమార్ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే సునీతారెడ్డి హయాంలోనే నర్సాపూర్ నియోకవర్గం అన్ని విదాలుగా అభివృద్ధి చెందిందన్నారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి ప్రొటోకాల్ విషయం అడిగితే దాన్ని అవాకులు, చవాకులు పేలి ఆమెపై వ్యక్తిగత విమర్శలు చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. ఇకమీదట ఎమ్మెల్యే సునీతారెడ్డిపై లేనిపోని వ్యక్తిగత విమర్శలు చేస్తే సహించేదిలేదని తగిన గుణపాఠం చెబుతామన్నారుకాంగ్రెస్ నాయకుల్లారా ఖబడ్దార్ ఎమ్మెల్యే సునీతారెడ్డి పై విమర్శలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు కావస్తున్నా ఆరు గ్యారంటీలు సక్రమంగా అమలు చేయలేదన్నారు. అంతేగాక కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన అనంతరం నియోజకవర్గానికి చేసిందేమి లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని చెప్పుకుంటున్న ఇంచార్జీ ఆవుల రాజిరెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ ఈ నియోజకవర్గానికి ఏమి ఉద్దరించారని ప్రశ్నించారు. ఇప్పటికైనా వ్యక్తిగత విమర్శలు మానుకొని అభివృద్ధిపై దృష్టి సారించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బోగ శేఖర్, మాజీ సర్పంచ్ జితేందర్‌రెడ్డి, సామ్యానాయక్, రింగుల ప్రసాద్, రాజెందర్‌నాయక్, శ్రీనివాస్ యాదవ్, షేక్‌హుస్సెన్, తొంట వినయ్, ఆంజనేయులు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులను అందిస్తున్న డీఈవో రాధక్రిష్ణ

## క్రీడలు నాయకత్వ లక్షణాలను నేర్పుతుంది : డిఇవో

**చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త:** క్రీడలు మానసికోల్లాసంతో పాటు నాయకత్వ లక్షణాలను నేర్పుతుందని జిల్లా విద్యాధికారి రాధాక్రిష్ణ అన్నారు. శుక్రవారం చిన్నశంకరంపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో స్కూల్ ఫెడరేషన్ గేమ్స్ ఆధ్వర్యంలో మండల స్థాయిలో నిర్వహించిన ఆటల పోటీల ముగింపు కార్యక్రమానికి హాజరై విద్యార్థులకు బహుమతులను అందించారు. విద్యార్థులు విద్యతోపాటు క్రీడల పట్ల ఆసక్తి కనబర్చాలన్నారు. క్రీడలతో మానసికోల్లాసం కాకుండా స్నేహబంధం పెంపొందుతుందన్నారు. ఆటలు ఆడటం వల్ల మానసికోల్లాసంతోపాటు, శారీరకంగా బలంగా ఉంటామన్నారు. ఆటల్లో గెలుపు, ఓటములు సహజమని, ఓటమితో ఎవరూ నిరుత్సాహపడొద్దన్నారు. గెలుపు ముఖ్యం కాదని, క్రీడాస్పూర్తి ముఖ్యమన్నారు. అండర్ 17 విభాగంలో నిర్వహించిన కబడ్డీ ఆటలో విజేతగా మిర్జాపల్లి, ఖోఖో ఆటలో విజేతగా కేజీబీవి విద్యార్థినిలు, వాలీబాల్ విజేతలుగా మిర్జాపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు నిలిచారు. గెలిచిన టీంలకు ఆయన బహుమతులను అందించారు. గెలిచిన టీంలను జిల్లా స్థాయి ఆటలకు ఎంపిక చేసినట్లు ఆయన వివరించారు. క్యాక్రమంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పోచయ్య, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

**సిద్దిపేట రూరల్, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త :** ప్రతి ఒక్కరూ వినాయక నవరాత్రోత్సవాల సందర్భంగా మట్టి విగ్రహాలను పూజించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని కాటం శోభ రఘురామ్ అన్నారు. వినాయక చవితి పర్వదినం సందర్భంగా పట్టణంలోని 42వ వార్డులలో శుక్రవారం ఇంటింటికి మట్టి వినాయకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రజలు పాల్గొన్నారు.

## ప్రెస్‌క్లబ్‌లో జాతీయ జర్నలిస్ట్ డే

**సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్ 6, ప్రభాతార్త :** సమాజంలో జర్నలిస్టు వృతి విలువలతో కూడినదని బిజెపి ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బైరి శంకర్, విద్యారణ్య అవాస విద్యాలయం జోనల్ ఇంచార్జి కాటం రవీందర్‌లు అన్నారు. జాతీయ జర్నలిస్టు డే సందర్భంగా శుక్రవారం సిద్దిపేట అర్బన్ ప్రెస్‌క్లబ్‌లో అర్బన్ జర్నలిస్టులను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో అవాస విద్యాలయం చైర్మన్ కొమురవెల్లి శేఖరం, సరస్వతి శిశు మందిర్ హెచ్ఎం నరేష్, అకాడమీ ఇంచార్జి విజయలక్ష్మీ, నవీన్, జర్నలిస్టులు పాల్గొన్నారు.

**సంతోషిమాత దేవాలయం మాజీ పాలక మండలి ఆధ్వర్యంలో..**

శ్రీసంతోషిమాత దేవాలయం సిద్దిపేటలో ఆలయ మాజీ పాలక మండలి ఆధ్వర్యంలో జర్నలిస్ట్‌డే సందర్భంగా జర్నలిస్టులను సన్మానించారు. ఈ సందర్భంగా అర్చకులు సంతోషిమాత అమ్మవారి అశీర్వచనం అందజేశారు. కార్యక్రమంలో మంకాల నవీన్‌కుమార్, కాశీనాథ్, సిబ్బంది శంకర్, వాసు, అర్చకులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో**

జర్నలిస్టు డే పురస్కరించుకొని శుక్రవారం సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పూజల హరికృష్ణ ఆధ్వర్యంలో జర్నలిస్టులను శాలువాలు, పూల మాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎం.డి.ఇమామ్(అత్తు), బొమ్మల యాదగిరి, దేవులపల్లి యాదగిరి, మంద పాండు, పూజల గోపికృష్ణ, కలీం, లక్ష్మీ, జర్నలిస్టులు పాల్గొన్నారు.

**టిపిసిసి సభ్యుడు చంద్రం ఆధ్వర్యంలో...**

టిపిసిసి సభ్యులు దరిపల్లి చంద్రం ఆధ్వర్యంలో జర్నలిస్ట్ డేను పురస్కరించుకొని శుక్రవారం తన కార్యాలయంలో పలువురు జర్నలిస్టులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పార్టీన్త నాయకులు నాయిని నర్సింహారెడ్డి, జర్నలిస్టులు పాల్గొన్నారు.

**ములుగు రోటరీ క్లబ్ ఆఫ్ గజ్వేల్ ఆధ్వర్యంలో...**

**ములుగు, సెప్టెంబర్ 6 (ప్రభాతవార్త):** ప్రజా సమస్యల పరిష్కారంలో పాత్రికేయుల పాత్ర ఎంతో కీలకమని రోటరీ క్లబ్ ఆఫ్ గజ్వేల్ అధ్యక్షుడు సామల నర్సింహ్మారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం అంతర్జాతీయ జర్నలిస్టుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ములుగు మండల పాత్రికేయులను రోటరీ క్లబ్ ఆఫ్ గజ్వేల్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా పనిచేస్తూ ప్రజల సమస్యలను పరిష్కరించడంలో పాత్రికేయులు ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో ప్రజలకు, విద్యార్థులకు ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే రోటరీ క్లబ్ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. గ్రామాల్లోని పేద మహిళలకు కుట్టు మిషన్లు, విద్యార్థులకు సైకిళ్ళు, ఉచిత ఆరోగ్య చికిత్సలు వంటి సేవలు అందించి అండగా నిలుస్తామన్నారు. పాత్రికేయుల సేవలను గుర్తించి వారిని సన్మానించడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సెక్రటరీ మహాదేవుని శ్రీనివాస్‌గౌడ్, ట్రెజరర్ సాయిరెడ్డి, పూర్వ అధ్యక్షుడు కొడాలి చంటి, కరుణాకర్‌రెడ్డి, దాస జగదీశ్వర్, ఏనుగు బాపురెడ్డి, చిరంజీవి, వెంకట్‌రెడ్డి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

**జగదేవ్‌పూర్‌లో...**

**జగదేవ్‌పూర్, సెప్టెంబర్ 6 (ప్రభాతవార్త):** మండల కేంద్రంలో ఎన్నో సంవత్సరాలుగా జర్నలిస్టు వృత్తిని చేపట్టి అందరి మన్ననలు పొందిన మునీర్‌ను జర్నలిస్టు డే సందర్భంగా శుక్రవారం శ్రీ చైతన్య ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఉదయభాస్కర్‌రెడ్డి, వైద్య సిబ్బంది జితేందర్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నర్సింహ్మారెడ్డి, సీనియర్ జర్నలిస్టు డి.కృష్ణ, ముదిరాజ్ సంఘం నాయకుడు రాగుల రాజు తదితరులు పాల్గొన్నారు.

# కుంటలో పడి వ్యక్తి గల్లంతు

**నర్సాపూర్, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త:** కుంటలో పడి ఒక వ్యక్తి గల్లంతైన సంఘటన నర్సాపూర్ మండల పరిధిలోని రుస్తుంపేట గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఈ సంఘటన వివరాలు గ్రామస్తుల కథనం ప్రకారం..... రుస్తుంపేట గ్రామానికి చెందిన గుండం అశోక్(54) గ్రామ సమీపంలోని కుమ్మరి కుంటలో పడి గల్లంతయ్యారని గ్రామస్తులు తెలిపారు. గండం అశోక్ గేదెలను మేపడానికి వెళ్లి కుమ్మరి కుంటలో ప్రమాదవశాత్తు పడిపోయి గల్లంతయ్యాడని తెలిపారు. సమాచారం తెలుసుకున్న నర్సాపూర్ ఎస్ఐ లింగం సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. అనంతరం ఫైర్ స్టేషన్ సిబ్బందితో కుమ్మరి కుంటను గాలించారు. రాత్రి సమయం వరకు ఎంత గాలించినా అతని ఆచూకి లభించలేదు. దీంతో సిబ్బంది తిరిగి రేపు గాలించవచ్చని వెళ్లిపోయారు. కుమ్మరి కుంటలో గల్లంతైన గుండం అశోక్‌కు పెళ్లి కాలేదని ఎవరూ లేరని గేదెలను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. కుమ్మరి కుంటలో ఎంత గాలించిన దొరకనందున శనివారం గాలించనున్నట్లు ఎస్ఐ లింగం తెలిపారు.



మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

## ప్రకృతి హితమే పండుగల పరమార్ధం : ఎమ్మెల్యే

**పటాన్‌చెరు, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త:** హిందూ సంప్రదాయంలో ప్రతి పండుగ వెనక ఒక పరమార్ధం దాగి ఉందని, వినాయక చవితి సందర్భంగా ప్రతి ఒక్కరు పర్యావరణసహిత మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కోరారు. వినాయక చవితిని పురస్కరించుకొని జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో పటాన్‌చెరు పట్టణంలోని గాంధీపార్కు వద్ద ఉచితంగా మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమల అంశంపై ప్రజలకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. రసాయనాలతో కూడిన ప్రతిమలను చెరువులలో నిమజ్జనం చేయడం మూలంగా జంతుజాలం చనిపోవడంతో పాటు, నీటి కాలుష్యం ఏర్పడుతుందన్నారు. జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ప్రజలందరికి ఉచితంగా మట్టి వినాయకులు పంపిణి చేయడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మూడు డివిజన్ల పరిధిలో 7500 వినాయక ప్రతిమలను ప్రజలకు అందుబాటులో ఉంచడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు కార్పోరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ సురేష్, అఫ్జల్, వెంకటేష్, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై దేశవ్యాప్త ఉద్యమం

### సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లిఖార్జున్



మాట్లాడుతున్న మల్లిఖార్జున్

**పటాన్‌చెరు, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త:** కాంట్రాక్టు క్యాజువల్ కార్మికుల సమస్యలపై దేశవ్యాప్త ఉద్యమం చేపట్టనున్నట్లు సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జె మల్లిఖార్జున్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని శ్రామిక్ భవన్‌లో జరిగిన సమావేశంలో మల్లిఖార్జున్ మాట్లాడుతూ సీఐటియూ ఆధ్వర్యంలో సెప్టెంబర్ నెల అంతా కాంట్రాక్టు, క్యాజువల్ ఫిక్స్‌డ్ అన్ని రకాల కార్మికుల సమస్యల పైన దేశవ్యాప్తంగా ఉద్యమం చేపడుతున్నట్లు చెప్పారు. కనీస వేతనం 26 వేలకు పెంచాలని, కార్మికులందరికి ఈఎస్ఐ, పీఎఫ్, బోనస్, యూనిఫాం, సెలవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. యజమానులు, అనేక సంస్థల వాళ్లు ఏ ఒక్కటీ అమలు చేయట్లేదన్నారు. చట్టాలను అమలు చేయకుండా దోపిడి చేస్తున్నారని తెలిపారు. ఈ పోరాటంలో కాంట్రాక్టు, క్యాజువల్, ఫిక్స్‌డ్ అన్ని రకాల కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియూ అధ్యక్షులు డి మల్లేష్, జిల్లా కోశాధికారి కె రాజయ్య, పాండురంగారెడ్డి, శాంత కుమార్, రామక్రిష్టా, సంతోష్, చక్రదర్‌లు పాల్గొన్నారు.

## పేదలకు వరం సిఎం సహాయనిధి : ఎమ్మెల్యే

**బెజ్జంకి, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త :** సిఎం సహాయ నిధి పేదలకు వరంలాంటిదని ఎమ్మెల్యే డా॥కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు సీఎంఆర్ఎఫ్ లబ్దిదారులకు రూ.7,48,500 విలువగల చెక్కులను అందజేశారు. అనంతరం బేగంపేట గ్రామంలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌ను కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, పీఏసిఎస్ చైర్మన్ తన్నీరు శరత్‌రావులతో కలిసి ప్రారంభించారు.

**బాధిత కుటుంబానికి రూ.5 లక్షల ఎక్సిగ్రేసియా అందజేత**

తోటపల్లి గ్రామానికి చెందిన సందరి లక్ష్మణ్ ఇటీవల చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతిచెందగా శుక్రవారం బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పరామర్శించి బాధితులకు అండగా నిలుస్తామన్నారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేసియా అందజేశారు. అలాగే వ్యవసాయశాఖ నుంచి రైతు బీమా అందేలా చూస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఓ ప్రవీణ్, సూపరింటెండెంట్ అంజయ్య, డీటీ గోపాల్, ఆర్ఐ సంతోష్, ఏఎంసి చైర్మన్ పులి కృష్ణ, వైస్ చైర్మన్ చిలవేరు శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ నాయకులు ఒగ్గు దామోదర్, ముక్కిస రత్నాకర్‌రెడ్డి, అక్కరవేణి పోచయ్య, శ్రీనివాస్, శానగొండ శరత్, బైరి సంతోష్, చెన్నారెడ్డి, హరకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## టిపిసిసి అధ్యక్షుడిగా మహేష్‌కుమార్‌గౌడ్ నియామకంతో సంబరాలు


టపాసులు కాల్చి సంబరాలు జరుపుకుంటున్న దృశ్యం

**సిద్దిపేట రూరల్, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త :** టిపిసిసి అధ్యక్షుడిగా ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్‌ను నియమించడంతో సిద్దిపేటలో దరిపల్లి చంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం టపాసులు పేల్చి స్వీట్లు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా టిపిసిసి సభ్యులు దరిపల్లి చంద్రం మాట్లాడుతూ మహేష్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో మరింత బలోపేతం అవుతుందన్నారు. విద్యార్థి దశలో ఎన్ఎస్‌యుఐ నుంచి కాంగ్రెస్ పార్టీలో పని చేస్తున్న మహేష్‌కుమార్‌గౌడ్‌కు టిపిసిసి అధ్యక్ష పదవి అప్పగించడంపట్ల హర్షం వ్యక్తం చేశారు. బిసి బిడ్డ టిపిసిసి అధ్యక్షులుగా నియామకం కావడం సంతోషంగా ఉందన్నారు. మహేష్‌కుమార్‌గౌడ్‌ను టిపిసిసి సభ్యులుగా నియమించిన ఏఐసిసి అగ్రనేత రాహుల్‌గాంధీ, ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, సిఎం రేవంత్‌రెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నాయిని నర్సింహారెడ్డి తదితరులు ఉన్నారు.


పాండవుల చెరువును పరిశీలిస్తున్న ఆర్డీఓ, ఏసిపి, సిఐ తదితరులు

## నవరాత్రులను శాంతియుతంగా జరుపుకోవాలి

### -ఆర్డీఓ బన్సీలాల్, ఎసిపి పురుషోత్తంరెడ్డి

**గజ్వేల్ టౌన్, సెప్టెంబర్ 6 (ప్రభాతవార్త):** వినాయక నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని వినాయక ఉత్సవ కో-ఆర్డినేషన్ కమిటీ ఆర్డీఓ బన్సిలాల్, గజ్వేల్ ఏసిపి పురుషోత్తంరెడ్డి, సిఐ సైదా, తహసీల్దార్ శ్రావణ్‌కుమార్‌లు అన్నారు. శుక్రవారం వినాయక నవరాత్రులు, నిమజ్జనంకు సంబంధించిన ఏర్పాట్లపై చర్చించారు. అనంతరం గజ్వేల్ పట్టణంలోని పాండవుల చెరువు, ప్రజ్ఞాపూర్ ఊర చెరువు, ముట్రాజ్‌పల్లి చెరువులను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినాయక నిమజ్జనం సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా చూసుకోవాలన్నారు.

## అంగన్‌వాడీలో పోషణ వారోత్సవాలు

**గజ్వేల్ టౌన్, సెప్టెంబర్ 6 (ప్రభాతవార్త):** గజ్వేల్ మండలం అహ్మదీపూర్ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రానికి వచ్చే చిన్నారుల బరువు, ఎత్తు, ఛాతి కొలత చూసి వారి యొక్క పోషణ స్థితి గురించి తెలియజేశారు. గర్భిణీ మహిళలు, బాలింతలు, చిన్నారులు పోషకాలు ఉండే ఆహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని అవగాహన కల్పించారు. అనంతరం గర్భిణీలకు, పిల్లలకు బాలామృతం లడ్డూలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు రాధిక, అనురాధ పాల్గొన్నారు.

## మట్టి వినాయకుల పంపిణీ

**జగదేవ్‌పూర్, సెప్టెంబర్ 6 (ప్రభాతవార్త):** మండల కేంద్రంలోని గణేష్ ఆలయం వద్ద శుక్రవారం మట్టి వినాయకుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి బాలేషంగౌడ్ పాల్గొని మట్టి వినాయకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి వినాయకులను పూజించడం వల్ల పర్యావరణాన్ని కాపాడవచ్చని, ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను పూజించడానికి కృషి చేయాలన్నారు.

**ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో...**


మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న బోర్లెపు శ్రీనివాస్‌గుప్త తదితరులు

**నర్సాపూర్, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త:** వినాయక చవితి పండగను పురస్కరించుకొని ఆర్యవైశ్య మహాసభ అధ్వర్యంలో నర్సాపూర్ పట్టణంలో మెదక్‌జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు బోర్లెపు శ్రీనివాస్‌గుప్త అధ్వర్యంలో మట్టి గణపతులను పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా బోర్లెపు శ్రీనివాస్‌గుప్త మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మట్టి గణపతులను ప్రతిష్టించి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అద్యక్షులు బోర్లెపు శ్రీనివాస్‌గుప్త తో పాటు సంఘ సభ్యులు జూలూరి వెంకటేశంగుప్త, జొన్నాడ మల్లేషంగుప్త, పైడి శ్రీధర్ గుప్త, హరీష్‌గుప్త, నోముల వీరేశంగుప్త, సుధాకర్‌గుప్త, ఒఖ వెంటేశం గుప్త, రాముగుప్త, కాశీ గుప్త, శ్రీనివాస్‌గుప్త, భైరవగుప్త, శ్రీనుగుప్త, దేవగిరి శ్రీనుగుప్త తదితరులు పాల్గొన్నారు.

## జంగరాయిలో ఉచిత వైద్య శిబిరం

**చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త:** మండల పరిధి జంగరాయిలో శుక్రవారం ఉచిత వైద్య శిభిరాన్ని నిర్వహించారు. మెడిసిటి ఆసుపత్రి వారి సౌజన్యంతో గ్రామంలో వైద్య శిభిరాన్ని నిర్వహించారు. గ్రామస్తులకు కంటి, రక్త, బిపి, షుగర్ వంటి పరీక్షలను నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను అందించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సంజయ్, సురేష్, నాగార్జున, మాజీ మార్కెట్ కమిటి డైరెక్టర్ ప్రభాకర్, ఏఎంసీ డైరెక్టర్ శ్యామ్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## చదువు మానేసినవారికి ఓపెన్ స్కూల్ ఒక వరం

### జిల్లా కో ఆర్డినేటర్ వెంకటస్వామి

**నర్సాపూర్, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త:** చదువు మధ్యలో మానేసిన వారికి ఓపెన్ స్కూల్ ఒక వరమని ఉమ్మడి మెదక్ జిల్లా కో ఆర్డినేటర్ వెంకటస్వామి అన్నారు. శుక్రవారం నర్సాపూర్ పట్టణంలోని జడ్పిహెచ్ఎస్ బాయ్స్ స్కూల్‌లో 2024,,2025 సంవత్సరానికిగా ను ఓపెన్ స్కూల్ పదవ తరగతి ఇంటర్మీడియెట్ అడ్మిషన్ లకు సంబంధించిన గోడ పత్రికను, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కోఆర్డి నేటర్ వెంకటస్వామి మాట్లాడుతూ సమాజంలో వివిద పాఠశాలల్లో, కళాశాలలో చదువు మానేసిన వారికి మళ్ళీ చదువు కొనసాగించడానికి ఇది చక్కని అవకాశమని అన్నారు. తిరిగి ఉన్నత చదువులు కూడ కొనసాగించవచ్చని తెలిపారు ఓపెన్ స్కూల్ సర్టిఫికెట్లు అన్నివిదాలుగా రెగ్యులర్ సర్టిఫికెట్లతో సమానంగా పని చేస్తుందని తెలిపారు. ఈఅవకాశాన్ని చదువు మానేసిన విద్యార్థులు సద్వనియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ మేరకు సెప్టెంబర్ నెల 10వరకు అడ్మిషన్ లు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జడ్పిహెచ్ఎస్ బాయ్స్ స్కూల్ నర్సాపూర్ కోఆర్డినేటర్ విఠల్, అసిస్టెంట్ కోఆర్డినేటర్ వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు సామ్యా నాయక్, వీరేశం, శ్రీకాంత్‌గౌడ్, రాథోడ్, రమేశ్‌రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఓపెన్ స్కూల్ అడ్మిషన్ లకు సంబందించిన గోడ పత్రికను

**ప్రకటన**

తేదీ: 05.09.2024

శ్రీ మొహమ్మద్ అజామ్
E.No.605140
టైర్ బిల్డింగ్-I విభాగం, MRF లిమిటెడ్
R/o. ఇ.నం.3-37, పెద్దాపూర్ గ్రామం
మరియు ఇ.నం.6-1-44, ఉప్పర్ బజార్
సంగారెడ్డి, సంగారెడ్డి జిల్లా, TS.

విషయం: చార్జ్‌షీట్ / షోకాజ్ నోటీస్ - గురించి

మీరు అనధికారికంగా మీ విధులకు 06.03.2022 నుండి (నిరవధికంగా 732 రోజులు) గైర్హాజర్‌లో ఉన్నారు. మరియు యాజమాన్యం సంగారెడ్డి, పెద్దాపూర్ వద్ద మీ శాశ్వత, నివాసిత చిరునామాకు 16.08.2024 తేదీ వివరమైన చార్జ్‌షీట్ / షోకాజ్ నోటీస్ పంపింది. కాని ఆ రెండూ, మీరు పెద్దాపూర్ గ్రామంలో అందుబాటులో లేరని మీ సంగారెడ్డి చిరునామా తెలియలేదని తపాలా రిమార్క్‌లతో అన్‌సెర్వ్‌డుగా తిరిగి వచ్చాయి.

ఈ పరిస్థితులలో మీకు ఇందుమూలముగా సూచించునది ఏమనగా ప్రచురణ తేదీ నుండి 3 రోజులలో పై సంబంధిత చార్జ్‌షీట్‌ను మీరు ఫ్యాక్టరీ వద్ద మా నుండి సేకరించుకొని, మీరు సుదీర్ఘంగా అనధికారిక గైర్హాజరు అయినందుకు మీపై క్రమశిక్షణా చర్య ఎందుకు తీసుకోకూడదో తెలియజేస్తూ మీ వివరణ దాఖలు చేయవలసినదిగా మీకు సూచిస్తున్నాము. మీరు ఈ నోటీస్‌ను సేకరించుకోవడం మరియు మీ వివరణ దాఖలు చేయడంలో విఫలమైతే, యాజమాన్యం చట్టప్రకారం క్రమశిక్షణా చర్యకు ఉపక్రమిస్తుందని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

సం/- B.V. సుధాకర్
MRF లిమిటెడ్ తరపున
సీనియర్ ప్రొడక్షన్ మేనేజర్



నీటిపాలైన పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

## దెబ్బతిన్న పంటలను పరిశీలించిన వ్యవసాయాధికారులు

**అల్లాదుర్గం, సెప్టెంబరు 6, ప్రభాతవార్త:** ఇటీవల కురిసిన వర్షాలతో దెబ్బతిన్న పంటలను శుక్రవారం వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి రాజేష్ మాట్లాడుతూ పంటలకు వడలు తెగులు సోకినట్లు గుర్తించామన్నారు. పత్తి పంటలో మొక్కల సాళ్ల మధ్య నీరు నిల్వ ఉండకుండా బయటకు పంపేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. వడలు తెగులు నివారణకు మొక్క వయసును అనుసరించి 10 గ్రాముల పోటాషియం నైట్రేట్‌ను నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. వడలు తెగులు సోకిన మొక్కల మొదళ్లు తడిచేలా మూడు గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్ లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. వర్షాలు తగ్గిన వెంటనే 25 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ ఎరువులను మొక్కకు 5 సెంటీమీటర్ల దూరంలో వేయాలన్నారు. అధిక తేమ వల్ల ప్రతి మొక్కకు వేరుకుళ్లు తెగులు సోకే అవకాశం ఉందని, నివారణకు 3 గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్ లేదా ఒక గ్రాము కార్బండజిమ్ లీటరు నీటిలో కలిపి మొదళ్ల చుట్టూ నేలపై 7 నుంచి 10 రోజుల వ్యవధిలో రెండుమార్లు పిచికారి చేసుకోవాలన్నారు. రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటిస్తూ పంటల అధికదిగుబడి వచ్చేల చర్యలు తీసుకోవాలన్నారు.

## గుంతల మయంగా పోచంపల్లి రహదారి



గుంతల మయంగా మారిన పోచంపల్లి రహదారి దృశ్యం

**చౌటకూరు, సెప్టెంబరు 6, ప్రభాతవార్త:** మండల పరిధిలోని పోచంపల్లి రహదారి గుంతలమయంగా మారిపోయింది. మండల కేంద్రమైన చౌటకూరుకు పలు గ్రామాల ప్రజలు ఈదారి గుండానే చేరుకోవాల్సి ఉంది. ఈ దారిగుండానే ఆర్టీసి బస్సులు వెళుతూ ఉంటాయి. ఈ రోడ్డుగుండానే బొమ్మారెడ్డిగూడెం, ఉప్పరగూడెం, బద్రిగూడెం, లక్ష్మీసాగర్, లాల్‌సింగ్ నాయక్ తండా తదితర ప్రాంతాలకు వెళ్లాల్సి ఉంటుంది. రోడ్డు గుంతల మయంగా మారడంతో ద్విచక్ర వాహనాలపై ప్రయాణం భారంగా మారిందని, వర్షాలు కురిసిన సమయాల్లో ఎక్కడ గుంత ఉందో తెలియక ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణం చేస్తున్నామని వాహన చోదకులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు, వాహన చోదకులు పడుతున్న పాట్లను సంబంధిత అధికారులు, పాలకులు వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## విద్యార్థులకు ఎన్‌సిసి సర్టిఫికెట్లు అందజేత



విద్యార్థులకు ఎన్‌సిసి సర్టిఫికెట్లు పంపిణి చేస్తున్న దృశ్యం

**పాపన్నపేట, సెప్టెంబరు 6, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన పాపన్నపేటలోని ఉన్నత పాఠశాలలో విద్యను ఆర్జిస్తున్న విద్యార్థులకు శుక్రవారం ఎన్‌సిసి సర్టిఫికెట్లు అందచేశారు. పాఠశాలలో విద్యను అందుకుంటున్న 50మంది విద్యార్థులకు ఇటీవల నిర్వహించిన ఎన్‌సిసి ఏ సర్టిఫికెట్ పరీక్ష ప్రతిభ చాటిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు.

## ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం




ఉత్తమ ఉపాధ్యాయుడు రాజ్‌కుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**మనూర్, సెప్టెంబరు 6, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని సిపిఎస్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న రాజ్‌కుమార్ జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికవడంతో సన్మానం అందుకున్నారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సన్మాన కార్యక్రమం నిర్వహించారు. రాజ్‌కుమార్‌ను జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, సంగారెడ్డి ఎమ్మెల్యే మెదక్ ఎంపి రఘునందన్‌రావు, చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి శాలువాతో సత్కరించి మెమోంటోను అందించి ప్రత్యేకంగా అభినందించారు. రాజ్‌కుమార్‌ను తోటి ఉపాధ్యాయులతో పాటు గ్రామస్థులు ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## తార కళాశాలలో అడ్మిషన్లకు చివరి అవకాశం...

**సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 6, ప్రభాతవార్త:** పట్టణంలోని తారా కళాశాలలో డిగ్రీలో అడ్మిషన్లు పొందేందుకు ఆఖరి అవకాశాలు ఆరంభం అయ్యాయని ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్ తెలిపారు. కళాశాలలో అడ్మిషన్లు పొందనివారు ఆన్‌లైన్‌లో రూ. 400 చెల్లించి ఈ నెల 9వ తేదీలోగా చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో ధరఖాస్తులు చేసుకున్న వారు తారా కళాశాలకు మొదటి ప్రాధాన్యత ఆప్షన్ ఇచ్చుకోవాలన్నారు. సీట్లు వచ్చినవారు ఈ నెల 12, 13వ తేదీలలో కళాశాలలో అడ్మిషన్ పొందాలని తెలిపారు. దోస్తుకు సంబంధించి సందేహాలు ఉంటే 9441069020ను సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

## ఎంపిడిఓగా చంద్రశేఖర్ బాధ్యతల స్వీకరణ

**అల్లాదుర్గం, సెప్టెంబరు 6, ప్రభాతవార్త:** మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఎన్ చంద్రశేఖర్ శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. మెదక్ జిల్లాలోని శివంపేట మండల పరిషత్‌లో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించిన చంద్రశేఖర్ పదోన్నతిపై మండలానికి ఎంపిడిఓగా చేరుకున్నారు. ఇంతవరకు శంకర్ ఇంచార్జి ఎంపిడిఓగా విధులు నిర్వహించిన విషయం పాఠకులకు విధితమే.

## మట్టి గణపతులను తయారు చేసిన విద్యార్థులు

**మనూర్, సెప్టెంబరు 6, ప్రభాతవార్త:** పర్యావరణాన్ని కాపాడుకునేందుకు మట్టి గణపతులను పూజించాలని భావించిన విద్యార్థులు మట్టి గణపతులను తయారు చేశారు. మండల పరిధిలోని దవ్వూర్ గ్రామంలోని పాఠశాలలో విద్యను ఆర్జిస్తున్న విద్యార్థులు తమ ప్రాజెక్టు వర్కులో భాగంగా మట్టి గణపతులను తయారు చేసి గ్రామస్థులకు అందచేశారు. మట్టి గణపతులను తయారు చేసిన విద్యార్థులను ఉపాధ్యాయులు మధుసూదన్‌రెడ్డి అభినందించారు.

# గ్రామ పాఠశాలలో దిగజారుతున్న విద్యా ప్రమాణాలు

- డిప్యూటేషన్‌పై ఇద్దరు ఉపాధ్యాయులు
- సమయ పాలన పాటించని హెచ్‌ఎం
- ఉపాధ్యాయులు లేక టిసిలు తీసుకున్న 20 మంది విద్యార్థులు



ఎంఆర్‌సి కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న పోషకులు

**కంగ్టి, సెప్టెంబరు 6, ప్రభాతవార్త:** తల్లి చేను మేస్తే బిడ్డ కంచె మేస్తుందా అన్నట్లుగా మండలంలోని దెగువాడి ఎంపియుపిఎస్ పాఠశాల పరిస్థితి తయారైంది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు తన ఇష్టారీతిగా విధులకు హాజరువుతుండటంతో విద్యార్థుల భవిష్యత్తు బూడిదలో పోసిన పన్నీరులా మారుతోంది. ఇందుకు సంబంధించి పూర్తి వివరాల్లోకి వెళితే... మండలపరిధిలోని దెగువాడి గ్రామంలోని ఎంపి యుపిఎస్ పాఠశాలలో విద్యను అందుకుంటున్న 140 విద్యార్థులకు 5 మంది ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తూ వచ్చారు. ఇటీవల ఇద్దరు ఉపాధ్యాయులను ఇతర పాఠశాలకు డెప్యూటేషన్‌పై పంపగా పదోన్నతిపై పాఠశాలకు చేరుకున్న ప్రధానోపాధ్యాయులు నిత్యం హైదరాబాద్ నుంచి పాఠశాలకు చేరుకోవాల్సి ఉంది. వారంలో పాఠశాలకు ప్రధానోపాధ్యాయులు ఎప్పుడు వస్తారో, ఏ సమయానికి వస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. పాఠశాలకు సక్రమంగా విధులు హాజరు కాలేకపోతున్న ప్రధానోపాధ్యాయులను పోషకులు ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని పోషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలకు ఉపాధ్యాయులు రెగ్యులర్‌గా విధులకు రాలేకపోతుండటంతో చిన్నారుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని 20 మంది వరకు విద్యార్థులు ఇతర ప్రైవేటు పాఠశాలలో విద్యను అందుకునేందుకు టిసిలు తీసుకుపోయినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యను అందుకోవాలని పదే పదే చెబుతున్న జిల్లా అధికారులు పాఠశాల నిర్వహణ తీరుపై శ్రద్ధ వహించకపోవడం ఏమిటని పోషకులు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడితే విద్యాప్రమాణాలు దిగజారడం తథ్యమని, దీంతో పాఠశాల నుంచి విద్యార్థులకు ఇతర పాఠశాలకు చేరిపోతారని గ్రామస్థులు చర్చించుకుంటున్నారు. పాఠశాలకు కేటాయించిన 5 మంది ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ పాఠశాలకు చేరుకుని విద్యాబోధన చేసేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు జిల్లా విద్యాశాఖ అధికారి, ఎమ్మెల్యే, ఎంఆర్‌సి కార్యాలయాల్లో ధరఖాస్తులు చేసుకున్నారు. జిల్లా కలెక్టర్, డిఈఓలు స్పందించాలని గ్రామస్థులు వినతి చేస్తున్నారు.



మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

## మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

**నారాయణఖేడ్ టౌన్, సెప్టెంబరు 6, ప్రభాతవార్త:** పట్టణంలోని మంగల్‌పేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి మట్టి వినాయక విగ్రహాలను శుక్రవారం పంపిణీ చేశారు. మంగల్‌పేట్‌లోని కుమ్మరగల్లి శ్రీసంగమేశ్వర ఆలయంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ శెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్‌లతో కలిసి ఎమ్మెల్యే భక్తులకు మట్టి విగ్రహాలను అందించి వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పండగను భక్తి శ్రద్దలతో జరుపుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు పాటుపడాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ జగ్జీవన్, కౌన్సిలర్ రాజేష్ చౌహాన్, సవిత హనుమంతు, నాయకులు పండరిరెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## వరసిద్ది వినాయక ఆలయంలో శ్రావణమాస ముగింపు పూజలు

### -యువకుల బైక్ ర్యాలీ.. భక్తులకు అన్నదానం

**న్యాల్‌కల్, సెప్టెంబరు 6, ప్రభాతవార్త:** శ్రావణ మాసంలో నిత్యం ఉదయం మండల పరిధిలోని హద్నూర్ గ్రామంలోని స్వయంభూ శ్రీ వరసిద్ది వినాయక ఆలయాన్ని దర్శించుకుని పూజలు నిర్వహించిన భక్తులు శుక్రవారం శ్రావణ మాసం ముగింపు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. హద్నూర్ గ్రామానికి చెందిన 40 మంది భక్తులు శ్రావణ మాసంలో నిత్యం శ్రీ వరసిద్దివినాయక, శ్రీ సిద్దివినాయ ఆలయాలను లోక కళ్యాణార్థం (గ్రామం సుభిక్షంగా ఉండాలని) దర్శించుకోవడం గత కొన్ని సంవత్సరాలుగా ఆనవాయితీగా వస్తోంది. శ్రావణ మాసం ముగిసాక ఆయా ఆలయాల్లో తమ కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు అన్నదానం చేస్తూ వస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం గ్రామానికి చెందిన భక్తులు ఆలయానికి బైక్‌ర్యాలీగా చేరుకుని అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న భక్తలకు అన్నదానం నిర్వహించారు.

## ప్రధానోపాధ్యాయులకు 'మండలస్థాయి శిక్షణ'

### -సందర్శించిన మండల విద్యాధికారి నీలకంఠం

**కొల్చారం, సెప్టెంబర్6 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులకు,ప్రిన్సిపాళ్లకు శుక్రవారం యూడైస్ పైన రిసోర్స్ పర్సన్ సత్యనారాయణ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పాఠశాల మౌలిక వసతులు, విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయుల సంఖ్య వివరాలను ఏ విధంగా నమోదు చేయాలనేది తెలియజేయడం జరిగింది. శిక్షణ కార్యక్రమాన్ని మండల విద్యాధికారి నీలకంఠం సందర్శించారు. ఈ సందర్భంగా నీలకంఠం మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులందరూ ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి ఖచ్చితమైన వివరాలను పొందుపరచాలని తెలియజేశారు. దీని ఆధారంగానే పాఠశాలలకు మౌలిక వసతులు, నిధులు మంజూరు చేయడం జరుగుతుందని, దీని ఆధారంగానే ప్రతి జిల్లాకు గ్రేడ్ పాయింట్స్ ఉంటాయని, కాబట్టి ఆన్‌లైన్ చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అంతేకాకుండా ప్రధానోపాధ్యాయులందనూ నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని, త్వరలోనే నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్ష ఉంటుందని, దానికి అనుగుణంగా విద్యార్థులకు బోధన చేయాలని, ఈ పరీఓలు 3వ, 6వ, 9వ తరగతులకు నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ సత్యనారాయణ, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీధర్‌రెడ్డి, అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల వనరుల సిబ్బంది పాల్గొన్నారు.




శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న మండల విద్యాధికారి నీలకంఠం



వరద బాధితులకు రూ. 2 లక్షల అందచేస్తున్న భూపాల్‌రెడ్డి

## వరద బాధితులకు భూపాల్‌రెడ్డి ఆర్థిక సహాయం

**రామచంద్రాపురం సెప్టెంబరు 6, ప్రభాతవార్త:** ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో సంభవించిన వరద బాధితులను ఆదుకునేందుకు తెలంగాణ రాష్ట్ర శాసన మండలి మాజీ చైర్మన్ వెన్నవరం భూపాల్‌రెడ్డి ఆర్థిక సహాయం అందచేశారు. ఉమ్మడి రాష్ట్రాలకు చెరో లక్ష రూపాయల చొప్పున 2 లక్షల రూపాయల చెక్కులను అందచేయనున్నట్లు భూపాల్‌రెడ్డి ప్రకటించారు. రెండు రాష్ట్రాల సిఎం రిలీఫ్ ఫండ్‌లకు సంబంధించిన ఖాతాలకు నగదును ట్రాన్స్‌ఫర్ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి, నాయకులు కుమార్ గౌడ్, జగన్నాథ్‌రెడ్డి, బిఆర్ఎస్‌వి కో-ఆర్డినేటర్ తొంట క్రిష్ణరెడ్డి, మహేందర్ పాల్గొన్నారు.

## ఆశ్రమానికి ఆర్థిక సహాయం అందజేత

**శివ్వంపేట, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:** హైదరాబాద్‌లోని అమ్మ నాన్న చిన్నారుల ఆశ్రమ సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు నవీన్‌గుప్తాను తన వంతు సహాయం అందించాలని కోరడంతో శుక్రవారం ట్రస్టు సభ్యులకు కోరిన వెంటనే అనాథ చిన్నారుల కోసం రూ. 16 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా నవీన్ గుప్తా మాట్లాడుతూ అనాథ ఆశ్రమం ఏర్పాటు చేసి పిల్లల ఆలనా పాలన చూస్తూ ఆశ్రమం నడిపించడం ఎంతో గొప్ప విషయమన్నారు. ఆర్థిక సహాయం అందజేసిన నవీన్ గుప్తకు ప్రత్యేక కృతజ్ఞతలు ఆశ్రమ సభ్యులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వారాల గణేష్, దావూద్, ఈసారపు రాజు, ప్రభు లింగం, ఆశ్రమ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మట్టి గణపతి విగ్రహాలనే పూజించండి

**కొండపాక, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త :** వినాయక చవితి నవగ్రహల్లో బాగంగా మట్టి గణపతులనే పూజించి పర్యావరణాన్ని రక్షించాలనే ఉద్దేశంతో విద్యార్థులకు అవగహన కలి ్పంచినట్లు హెచ్‌ఎం చిల రవి తెలిపారు. శుక్రవారం తిప్పారం ప్రాథమిక పాఠశాలలో పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి గణపతులనే ఉపయోగించాలని సూచించినట్లు అ పాఠశాల హెచ్‌ఎం తెలిపారు. పిఒపితో చేసిన గణపతి విగ్రహల వల్ల పర్యావరణం కలుషితం అవుతుందన్నారు. మట్టితో చేసిన గణపతి విగ్రహల వల్ల పర్యావరణానికి ఎలాంటి హాని జరగదనే ఉద్దేశంతో విద్యార్థులకు మట్టి గణపతి విగ్రహల తయారీపై అవగహన కలి ్పంచినట్లు అయన తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, మాధురి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సమాజ హితం కోసం జర్నలిస్టులు నిరంతరం శ్రమిస్తారు

### పిఆర్‌టియు జిల్లా అధ్యక్షుడు లింగ శ్రీనివాస్

**కొండపాక, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త :** ప్రభుత్వాలకు ప్రజలకు మధ్య వారధిగా జర్నలిస్టులు ఉంటూ ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా పని చేస్తారని పిఆర్‌టీయు ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు లింగ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం సిర్సనగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నేటి సమాజంలో జర్నలిస్టుల పాత్ర అనే అంశంపై విద్యార్థులకు జర్నలిస్టులడే సందర్భంగా ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా ప్రధానకార్యదర్శి ముక్క రమేష్‌తో కలిసి మాట్లాడారు. సమాజం బాగు కోసం నిరంతరం పనిచేస్తున్నారని, జర్నలిస్టులు సమాజనికి దిక్సూచి వంటి వారని అన్నారు. సమాజంలో జరిగే అవినీతి, అన్యాయాలు, అక్రమాలు, ప్రభుత్వ తప్పిదాలు, స్కామ్‌లు, స్కీముల గురించి నిజాలను నిర్భయంగా తెలియజేసే వారే జర్నలిస్‌లని వివరించారు. జర్నలిజం వృత్తి కత్తిమిద సాములాంటిదని పేర్కొన్నారు. సమాజంలో జరుగుతున్న విషయాలను తెలుసుకొడానికి ప్రతి వ్యక్తి మిడియా మీదనే అధారపడి ఉదయం లేవాగానే వార్త పత్రికలు, టివిలు చూస్తామని తెలిపారు. రాత్రింబవళ్లు అనే తేడాలు లేకుండా సమాజం కోసం పనిచేసే వారు జర్నలిస్టులని అన్నారు. అనంతరం మండలంలోని జర్నలిస్టులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఉపన్యాస పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. మొదటి బహుమతి పాశం నక్షత్ర, రెండవ బహుమతి ఇరుకుల్ల హెమ, ద్వితీయ బహుమతి పుల్ల ఐశ్వర్య అందుకున్నారు. కార్యక్రమంలో సభ్యులు దయానంద్, సరస్వతీ, కష్టారెడ్డి, ఉపాధ్యాయ బృదం పాల్గొన్నారు.



జర్నలిస్టులను శాలువాలతో సన్మానించిన పిఆర్‌టియు నాయకులు

# వినాయకుని మండపాలు సిద్ధం

**అమీన్‌పూర్, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:** వినాయకచవితి నవరాత్రి ఉత్సవాలకు మండపాలను సిద్ధం చేశారు. శనివారం వినాయక చవితి రోజు గణనాథుడి విగ్రహాలను ప్రతిష్ఠించి తొమ్మిది రోజులపాటు పూజలు నిర్వహించనున్నారు. అమీన్‌పూర్ మండలంలో వినరగహాలను ప్రతిష్ఠించేందుకు మండపాలను సిద్ధం చేశారు. మండలంలో దాదాపు 300 వినాయక విగ్రహాలు పూజలు అందుకోనున్నాయి. అందుకు తగ్గట్లు మండపాలను సిద్ధం చేశారు. ఇప్పటికే విగ్రహాలు మండపాలకు చేరుకున్నాయి. వర్షాకాలం కావడంతో మండపాలను తగు జాగ్రత్తలు తీసుకుంటూ ఏర్పాటుచేశారు. వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించడానికి యువకులు ఎక్కువగా ఉత్సాహం చూపడంతో మండపాల వద్ద బిజీ బిజీగా గడుపుతున్నారు. దేవాలయాల్లో, బహిరంగ ప్రదేశాల్లో మండపాలను ఏర్పాటు చేస్తున్నారు.

### ప్రశాంత వాతావరణంలో పండుగ నిర్వహించుకోవాలి : సిఐ

ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి పండుగను నిర్వహించుకోవాలని అమీన్‌పూర్ సీఐ సదా నాగరాజు ప్రజలను కోరారు. 237 మండపాలకు అనుమతులకు అర్జీ పెట్టుకోవడం జరిగిందని ఆయన వివరించారు. డీజేలకు ఎలాంటి అనుమతి లేదని, డీజే ఏర్పాటు చేస్తే కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. వినాయక మండపాల దగ్గ భద్రతకు రాత్రి సమయంలో మండపాల వద్ద విధిగా నిర్వాహకులు వాలంటీర్లను కాపలాగా ఉంచాలని, ఎవరికి వారు తగు పద్ధతి ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఫైర్, విద్యుత్ శాఖల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని, వారు సూచించిన నియమ నిబంధనలకు అనుగుణంగా మండపాల వద్ద నీళ్లు, ఇసుక ఏర్పాటు చేసుకొని తగిన ముందు జాగ్రతలు తీసుకోవాలని, విద్యుత్ వైర్లు, ప్రకాశవంతమైన లైట్ల వినియోగంలో జాగ్రత్త వహించాలని సూచించారు. చుట్టుప్రక్కల ప్రజలు ఎలాంటి ఇబ్బంది కలగకుండ మండపాల నిర్వాహకులు చూసుకోవాలని ఆయన కోరారు. ఊరేగింపుల్లో బాణసంచా కాల్చడం గానీ, డీజే శబ్దాలు ఏర్పాటు నిరోధించాలన్నారు. ట్రఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీస్ శాఖ సూచనలను తప్పకుండా పాటించాలన్నారు. పెద్ద వినరగహాలు ఏర్పాటు చేస్తే మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.



మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఎంపి, మెదక్ జిల్లా కలెక్టర్

## పర్యావరణాన్ని పరిరక్షిద్దాం : ఎంపి

**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు నిర్వహించాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు.వినాయక చవితి పండుగను పురస్కరించుకొని మట్టి వినాయకులను శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో భక్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ పర్యావరణం కలుషితం కాకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ మట్టివినాయకులనే పూజించాలని పిలుపునిచ్చారు. ప్రజలకు వినాయకచవితి శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**ఎంపి రఘునందన్‌రావుకు వినతిపత్రం అందజేత...**

మెదక్ జిల్లాను రాజన్న సిరిసిల్ల జోన్ నుండి చార్మినార్ జోన్‌లోకి మార్చేలా కృషి చేయాలని ఎంపీ రఘునందన్‌రాఉవకు ట్రెసా జిల్లా కమిటీ పక్షాన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బాధ్యులు నర్సింలు, పరమేషన, సందీప్, శైలజ, నాగరాజు తదితరులు ఉన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి : ఎమ్మెల్యే




మట్టిగణపతులను అందచేస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్

**రామచంద్రాపురం, సెప్టెంబరు 6, ప్రభాతవార్త:** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి అన్నారు. జిహెచ్‌ఎంసి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మట్టి విగ్రహాల పంపిణి కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రజలకు అందచేశారు. విగ్రహాల పంపిణి అనంతరం బీడిఎల్ కాలనీలో కొత్తగా నిర్మించిన మినీ ఫంక్షన్ హాల్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, నాయకులు ఆదర్శ్‌రెడ్డి, పరమేష్ యాదవ్, ఐలేష్, జిహెచ్‌ఎంసి డిప్యూటీ కమిషనర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## మట్టి గణపతులతో పర్యావరణానికి మేలు

**గుమ్మడిదల, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:** గుమ్మడిదల మండలం బొంతపల్లి పారిశ్రామికవాడలో మెట్రోకం పరిశ్రమ యాజమాన్యం ప్రజలకు వినాయక చవితి సందర్భంగా మట్టి గణపతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పరిశ్రమ ప్రతినిధులు స్వామినాయుడు, శ్రీరామ్ మాట్లాడుతూ పర్యావరణానికి మేలుచేసే మట్టిగణపతి ప్రతిమలను ఉపయోగించాలన్నారు. వినాయక చవితి నవరాత్రులు పూజల కోసం జిన్నారం నుండి బొంతపల్లికి పోయే రోడ్డుపై గేటు ఎదురుగా స్టాల్ ఏర్పాటు చేసి వచ్చిపోయే వాహనదారులకు, కాలి నడకన వెళ్లే వారికి వినాయకుని మట్టి ప్రతిమలను శుక్రవారం రోజున ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు ఎస్. భిక్షపతిరెడ్డి, పరిశ్రమ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మట్టి గణపతి విగ్రహాల పంపిణీ

**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:** వినాయక చవితి సందర్భంగా మెదక్ డిగ్రీ కళాశాల ఎకో క్లబ్, వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను విద్యార్థులు తయారు చేయడం జరిగింది. అమర్‌నాథ్ అన్నదాన సేవా సమితి, సిద్దిపేట వారి సహకారంతో తయారు చేసిన తెచ్చిన మట్టి వినాయక విగ్రహాలను హౌసింగ్ బోర్డు కాలనీలో ఇంటింటికి వెళ్లి ఉచితంగా పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థుల క్షేత్రస్థాయి సమాజ సేవలో భాగంగా విద్యార్థులు ఉచితంగా మెదక్‌లోని కొత్త బస్టాండ్ వద్ద ప్రజలకు, ప్రయాణికులకు పంపిణీ చేస్తూ పర్యవరణ పరిరక్షణకై మట్టి వినాయకుల వాడకమును గురించి అక్కడ ఉన్న ప్రయాణిలకు, ఇతర ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమానికి సంబంధించి ప్రజల నుండి మంచి స్పందన వచ్చిందని, భక్తులు చాలా సంతోషంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించినందుకు కళాశాల ప్రిన్సిపాల్, వృక్షశాస్త్ర విభాగాధిపతికి, ఎకో క్లబ్ వారికి, పాల్గొన్న విద్యార్థులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హుస్సేన్, వృక్ష శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ కె. నాగేందర్, మురళి, రాజు, టీజీఎస్‌ఆర్టీసీ డీఎం, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మృతి చెందిన ఎద్దు

## పిడుగు పాటుకు ఎద్దు మృతి

**సిర్గాపూర్, సెప్టెంబరు 6, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఉజలంపాడ్ గ్రామంలో పిడుగు పడి ఎద్దు మృతి చెందింది. ఉజలంపాడ్ గ్రామానికి చెందిన కిషన్ రాథోడ్ తన సాకుతున్న ఎద్దులను తీసుకుని వ్యవసాయ పొలానికి వెళ్లగా పిడుగు పడి ఒక ఎద్దు మృత్యువాత పడింది. నిరుపేద అయిన రైతు కిషన్ రాథోడ్ ఎద్దు పిడుగుపాటుకు మృతి చెందడంలో విలవలలాడుతున్నాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని రైతు కిషన్‌రాథోడ్, గ్రామ మాజీ సర్పంచ్ శోభావతి శేరికార్‌లు వినతి చేశారు.

## పోలీసులను విసిగించిన వ్యక్తి అరెస్టు

**సిర్గాపూర్, సెప్టెంబరు 6, ప్రభాతవార్త:** తాగిన మత్తులో పోలీసులను ఫోన్ చేసి విసిగించిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందుకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... మండల పరిధిలోని పోచాపూర్ గ్రామానికి చెందిన దూదేకుల నయీం(45) మద్యం మత్తులో నిత్యం సాయంత్రం మా అమ్మ భూమి ఇస్తలేదని 100కు పదే పదే దయాల్ చేశాడన్నారు. తాగిన మత్తులో ఒక రోజు ఆరుసార్లు, మరో రోజు నాలుగుసార్లు 100కు కాల్ చేసి పోలీసుల సమయాన్ని వృదా చేయడమే కాకుండా విసుగు తెప్పించడన్నారు. అనవసరంగా పదే పదే 100కు కాల్ చేసిన దూదేకుల నియంను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. అత్యవసరమైతేనే 100కు కాల్ చేయాలని, తాగిన మత్తులో, టైంపాస్ కోసం 100కు దయల్ చేస్తూ ఉంటే అత్యవరసమైన వారికి ఫోన్ అందుబాటులో ఉండకపోవచ్చని, ఫలితంగా వారు ఇబ్బందులు, కష్టనష్టాలకుగురయ్యే అవకాశాలు ఉంటాయని ఎస్ఐ సూచించారు.




పోలీసుల అదుపులో దూదేకుల నయీం